నేటి దినపత్రిక
# సూర్య
బుధవారం
6 డిసెంబర్
2023
పేజీలు 8
గుంటూరు
పల్నాడు













3 లో

# బీభత్సం సృష్టించిన మిచౌంగ్

తీవ్ర తుపాను మిగ్‌జాం బాపట్ల సమీపంలో తీరం దాటింది. దీంతో తీరం వెంబడి గంటకు 90-100కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పంటలు సర్వనాశనమయ్యాయి. జిల్లాలో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి పంట నేల వాలిపోయింది. మంగళవారం అర్ధరాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం, ఈదురు గదులు వీస్తున్నాయి, జనజీవనం స్తంభించిపోయింది, పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పంట నష్టం పెద్ద ఎత్తున ఉండవచ్చునని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. కృష్ణ డెల్టాలో ఎటువైపు చూసినా కకవికమైన పంటచేలే కనిపిస్తున్నాయి. బాపట్ల దగ్గర తుఫాన్ తీరం దాటడం వల్ల పంట నష్టం ఎక్కువగా ఉంది. డెల్టాలో కూరగాయ తోటలు, అరటి ఇతర పంటలు కకా వికలం కావడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు..

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

- బాపట్ల వద్ద తీరం దాటిన తుఫాన్
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈదురుగాలులు
- భారీగా పంట నష్టం
- స్తంభించిన జనజీవనం



# ముంచిన మిచౌంగ్

- పల్నాడులో లోతట్టు ప్రాంతాలు అతలాకుతలం
- స్తంభించిన జన జీవనం
- సర్వత్రా అప్రమత్తమైన యంత్రాంగం
- జలమయమైన పంట పొలాలు
- ఆందోళన చెందుతున్న రైతాంగం
- ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యేల భరోసా

**నేటి దినపత్రిక సూర్య బ్యూరో, పల్నాడు జిల్లా**

తుఫాన్ ఎఫెక్ట్ పల్నాడు జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలను రైతులను అతలాకుతలం చేస్తోంది. వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరి పంట నేలవారింది. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పంటల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఎక్కడ ప్రాణనష్టం జరగకపోయినా.. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరి ఆర్థికంగా ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగిన అక్కడికి వెళ్లి పరిష్కరిస్తున్నారు. జలమయమైన ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. అప్పటికప్పుడు కేంద్రాలు ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఏం జరుగుతుందో కలెక్టర్ మొదటి శివశంకర్ పరిశీలన చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో అధికారులే కాకుండా ప్రజా ప్రతినిధులు సైతం

మిగతా 3వ పేజీలో





3 లో

## నాడు మాండౌస్..
# నేడు మిచౌంగ్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డిసెంబరు నెలలో వస్తున్న తుపాన్లు కర్షకులకు కోలుకోలేని నష్టాలు మిగులుస్తున్నాయి. గతేడాది డిసెంబరు రెండోవారంలో వచ్చిన మాండౌస్ తుపాను వరి రైతులకు తీవ్ర నష్టం కలగజేసింది. ఇప్పుడు కూడా డిసెంబరు నెల తొలివారంలో మొదలైన మిగ్ జాం తుపాను రైతులకు తీవ్ర ఆందోళన కలగజేస్తోంది. డెల్టాలో చాప చుట్టేసిన వరి పొలాలు...

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

## వార్డుల్లో కమిషనర్ “షమ్మి” పర్యటన



సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్: సత్తెనపల్లి పట్టణం లోని 19 వార్డ్ - సుందరయ్య కాలనీలో మున్సిపల్ కమిషనర్ షమ్మీ, మంగళవారం పర్యటించారు. తుఫాను వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల దగ్గర మురుగు ప్రవహించే కాలువలను శుభ్రం చేయించారు. చప్టలలో ఆగిపోయిన చెత్తను ఇతర వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. చుట్టుపక్కల నివసించే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. తమ వార్డ్ ప్రజలకీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న కమిషనర్ షమ్మీకి 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ పార్థసారథి, షఫీ సిబ్బంది పాల్గొన్నారు.

## 20 రోజులకు పైగా పెన్షనర్స్ చేస్తున్న ఆందోళన



సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్: గత 20 రోజులకు పైగా సత్తెనపల్లిలో పెన్షనర్స్ చేస్తున్న ఆందోళన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అంబటి రాంబాబుకు కనిపించడం లేదా? అని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. సాంబశివరావు ప్రశ్నించారు. ఆక్రమణకు గురైన సత్తెనపల్లి పెన్షనర్స్ అసోసియేషన్ బిల్డింగ్ గదిని ఖాళీ చేయించాల్సిందిగా కోరుతూ గత 20 రోజుల నుండి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ శిబిరాన్ని సందర్శించిన సాంబశివరావు మాట్లాడుతూ...ఇంకెన్నాళ్ళు ఆ వృద్ధుల్ని ఇబ్బంది పెడతారు? న్యాయపరమైన అడ్డంకులన్నది కేవలం సాకు మాత్రమే. మంత్రి తల్చుకుంటే పరిష్కారించలేరా? అంత అసమర్థులా? ఇంత చిన్న సమస్యని పరిష్కరించలేనప్పుడు మంత్రి పదవి ఎందుకు? అని ఆయన ప్రశ్నలు వర్షం కురిపించారు. అక్రమాలు, దోపిడీలు చేయడానికేనా మంత్రి పదవి? ప్రధాన ప్రతిపక్షం ఈ విషయమై మౌనం వహించడం బాధాకరం. అన్ని వ్యవహారాల్లో కులాన్ని చూడడం అవివేకం. మానవత్వానికి ప్రాధాన్యతనివ్వడం సమాజంలో అవసరం. తక్షణమే వృద్ధులైన పెన్షనర్స్ సమస్యని పరిష్కరించి వారికి న్యాయం చేయమని కోరుతున్నట్లు కొమ్మిశెట్టి పేర్కొన్నారు. అనంతరం నిరసన తెలియజేస్తున్న అసోసియేషన్ సభ్యులకు సాంబశివరావు తన సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

## మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం



నరసరావపేట, మేజర్‌న్యూస్: గ్రామ పంచాయతీల రాబడి మరియు పరిపాలనా విధానము పై నరసరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సరావుపేట మండలంలోని మండల పరిపాలన అధికారి వుసర్తి శ్రీనివాస రావు, , విస్తరణాధికారి కెవి శివప్రసాద్ మరియు పంచాయతీ కార్యదర్శులు మస్తానవలి, రామసీత, స్వర్ణలత,వేమూరి నాని,సీనియర్ అసిస్టెంటు శ్యామ్ ప్రసాద్,జూనియర్ అసిస్టెంట్ సుందర్ దాసు,పంచాయతీ కార్యదర్శులు మరియు డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ధాన్యంకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి...!!



సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుపాను వల్ల జిల్లా లో పంట పొలాలు నీట మునిగాయని, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ధాన్యంకు రూ.25 వేలు చొప్పున రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని జై భీమ్ రావు భారత్ పార్టీ(జేబీపీ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సత్తెనపల్లి మండలం, పాకాలపాడు, రెంటపాళ్ళ తదితర గ్రామాల్లో పర్యటించి విలేకరులతో మాట్లాడారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి, మొక్కజొన్న, బొబ్బాయి లతోపాటు వరి పంటలు కొన్నిచోట్ల నేల కొరిగి, మరికొన్ని చోట్ల నీట మునిగాయని పేర్కొన్నారు. ప్రధా నంగా వరి, మొక్క జొన్న నెలకొరగగా, పత్తి తీయకపోవటంతో తడిసిపోయి పనికిరాకుండా పోయిందని, మిర్చి కూడా అదే పరిస్థితి అని చెప్పారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేసి ఆమేర నష్ట పరిహారం కై సిఫారసు చేయాలన్నారు. అదేవిధంగా పాడైన పంటలను తీసేసి ప్రత్యామ్నాయ పంటలను రైతులు వేసేటప్పుడు విత్తనాలు, ఎరువులు తదితర వాటిని సబ్సిడీ లో అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

**పట్టణ లోతట్టు ప్రాంతాల్లో పర్యటన..!!**

సత్తెనపల్లి పట్టణంలో నాగన్నకుంట, సుందరయ్య, వీరాంజనేయ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లో విజయ్ కుమార్ పర్యటించి ప్రజలతో మాట్లాడారు.. కాలువలు, వంకలు పొంగిపొర్లుతూ మురుగు కాల్వల్లో పూడిక తీయకపోవడంతో లో తట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి మురుగు నీరు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేసినట్లుగా ఆయన చెప్పారు. వర్షాలు తగ్గే వరకు అప్రమత్తంగా ఉంటూ అవసరం అయితే తప్పా ఎవరూ ఇళ్లలోనుంచి బయటకు రావద్దని ప్రజలకు ఆయన సూచించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మాతంగి సుధాకర్ రావు, నాయకులు మహంకాళి వెంకట్రావ్, జడ కమల్ కుమార్, దాసరి వెంకటేశ్వర్లు, మాలపాటి దేవరాజ్, కోటేశ్వర రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## “దేశం” కార్యకర్తలపై నమోదైన కేసులు ఎత్తివేయాలి



సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్ న్యూస్: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై నమోదైన రాజకీయ వేధింపుల కేసులు ఎత్తివేయాలని తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం సత్తెనపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో తెలుగుదేశం పార్టీ న్యాయవాదులు పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో న్యాయవాది, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ఆందోళనలో పాలుపంచుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలపై గత నాలుగున్నర సంవత్సరాలుగా పోలీస్ ప్రొసెడింగ్స్ విఆర్ఓ, వీఆర్ఏ లచే నమోదు చేయించబడిన అనేక క్రిమినల్ కేసులు తక్షణమే ప్రభుత్వము ఉపాసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి దివ్వెల శ్రీనివాస రావు మాట్లాడుతూ... బిఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన పౌరులకు ప్రజా ప్రాతినిధ్యం చట్టం ఇచ్చిన హక్కును కాపాడుతూ ఓటును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో తప్పుగా సమర్పించిన ఫారం-7 కు కారణమైన వారిపై విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు బత్తుల ఆదినారాయణ, గంగూరి అజయ్ కుమార్, బొక్క సంగీత రావు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల రాబడి మరియు పరిపాలన విధానంపై శిక్షణ కార్యక్రమం



పెదకూరపాడు, మేజర్‌న్యూస్: పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల రాబడి మరియు పరిపాలన విధానంపై గ్రామపంచాయతీ కార్యదర్శులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు .ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలలో జరిగిన పంచాయతీల అభివృద్ధి రాబడి ఖర్చులు పన్నులు వర్క్ రిజిస్టర్ లో తప్పక గ్రామ కార్యదర్శులు నమోదు చేయాలన్నారు .ఆయా పంచాయతీలకు సంబంధించిన సమావేశాలు గ్రామసభ సమావేశాలు నిర్వహించాలని పీఎస్ లకు సూచించారు. పంచాయతీలు తీర్మానించిన పనులు ఫిర్యాదులు పరిష్కారాలపై తీసుకోవాల్సిన చర్యలు వాటరు పంచాయతీ స్ట్రీట్ లైను కరెంటు తదితర అంశాలు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మీచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

**-జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు**



గురజాల, మేజర్‌న్యూస్: మిరప పంటకు ప్రసిద్ధిగాంచిన ప్రాంతం పల్నాడు... ఆరుగాలం శ్రమించి పండించిన పంట తుఫాన్ ప్రభావం వలన తీవ్రమైన నష్టం వాటిల్లే అవకాశం ఉందని, మీచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు కోరారు. యుద్ధ ప్రాతిపదికన తక్షణ సాయం కింద రైతులకు ఎకరాకు 20 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతుంటే మంత్రి రోజా రీల్స్ చేస్తూ ఎంజాయ్ చేస్తుందని ఆయన మండిపడ్డారు. మంత్రులకు ప్రజలు పట్ల ఎటువంటి చిత్తశుద్ధి ఉందొ ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సంయుక్త ప్రభుత్వం ఏర్పాటు చేసి రైతులకు అండగా ఉంటామని ఆయన తెలియజేశారు.

## క్రోసూరులో కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే నంబూరు



పెదకూరపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన క్రోసూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు,క్రోసూరు వ్యవసాయ శాఖ మార్కెట్ డైరెక్టర్ కూనల శ్రీనివాస్ ( బెల్లంకొండ శ్రీనివాస్) ఇటీవల హాస్పటల్లో కంటిలో శుక్లం తీయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గుగ్గిలం శేఖర్ కుమార్ గారి మాతృమూర్తి సామ్రాజ్యం అనారోగ్యముతో ఇటీవల హాస్పటల్లో చికిత్స పొంది ఇంట్లో వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారిని వారి ఇళ్ల వద్దకు వెళ్లి పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పరామర్శించారు. పార్టీ కి అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## మీచౌంగ్ తుఫాన్ వల్ల ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు

**- అధికారులను ఆదేశించిన కలెక్టర్ శివశంకర్**



నరసరవుపేట, మేజర్‌న్యూస్: మీచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో పల్నాడు జిల్లాల్లో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం తదితర నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లో తేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు లో ప్రాధాన్యతన రంగాలు మరియు విద్యుత్, రోడ్లు భవనాలు శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి ,పంట నష్టం పై అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని తదనుగుణంగా ప్రభుత్వానికి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అవసరమైన నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, ఉద్యానవన శాఖ అధికారి బెన్నీ, పౌడా వి.సి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ రెడ్డి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవాలి

**బీజేపీ కన్వీనర్ అంబటి నవ కుమార్**



**దాచేపల్లి, మేజర్ న్యూస్ :** తుఫాన్ కారణంగా గురజాల వర్గంలో మిరప, పత్తి రైతులు తెలంగాణ నష్టపోయారని బిజెపి నియోజకవర్గం కన్వీనర్ అంబటి నవ్ కుమార్ అన్నారు. నష్టాలు భారీ ఎత్తున జరిగా యని ఇటుపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని ఆయన కోరారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను సత్వరమే ప్రభుత్వ అధికారులు స్పందించి రైతులకు కావలసిన సహాయ సహకారాలను వెంటనే అందించాలని కోరారు. నియోజకవర్గంలో ఎన్ని హెక్టార్లలో మిరప పంట వేశారు ఎన్ని హెక్టార్లలో పత్తి పంట చేశారు అదేవిధంగా ఉద్యానవన పంటలు ఏమన్నా వేశారా? ఏస్తే వాటి యొక్క స్థితిగతులు ఏంటి వీటన్నిటిమీద సమగ్ర నివేదిక కేంద్ర ప్రభుత్వానికి పంపించవలసినగా సూచించారు. పంట ఇన్సూరెన్స్ చేపించారా రైతులను వెంటనే ఆదుకోవాలని అంబటి నవ కుమార్ డిమాండ్ చేశారు.

**జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు**



మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను, వెంటనే ఆదుకోవాలనీ జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిరప పంటకు ప్రసిద్ధిగాంచిన ప్రాంతం పల్నాడు అన్నారు. ఆరుగాలం శ్రమించి, పండించిన పంట తుఫాన్ ప్రభావం వలన,తీవ్రమైన నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన,తక్షణ సాయం కింద రైతులకు ఎకరాకు 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర ప్రజలు అల్లాడి పోతుంటే. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సంయుక్త ప్రభుత్వం ఏర్పాటు చేసి, రైతులకు,అండగా ఉంటామని, ఆయన తెలియజేశారు.

## లోతట్టు ప్రాంతాలను సందర్శిచండి

**టెలీ కాన్ఫరెన్స్‌లో పల్నాడు జిల్లా కలెక్టర్**

**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** మిచౌంగ్ తుఫాను నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎల్ శివశంకర్ జిల్లాలోని తహశీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో మండలాల పరిధిలో లోతట్టు ప్రాంతములను సందర్శించాలని ఆదేశించారు. అలాగే ఎక్కడైనా పునరావాసము అవసరమైతే వారికి పునరావాసము కల్పించాలన్నారు. ఆస్తి నష్టము జరిగితే వెంటనే సమాచారము తెలియజేయాలన్నారు. ఎటువంటి ప్రాణ నష్టము, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకొనవసినదిగా ఆదేశించారు. కావునా జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దారు మండలములోని పసుమర్రు గ్రామము మరియు పట్టణములోని అడ్డరోడ్డు సెంటర్, వినాయక నగర్ ప్రాంతములను సందర్శించారు. నీట మునిగిన ఇండ్లకు సంబంధించిన పండరీపురంలోని భారత రత్న ఇందిరా గాంధీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పునరావాస కేంద్రము ఏర్పాటు చేశారు.

## యాజమాన్య పద్ధతులు పాటించాలి : ఏవో సుగుణా బేగం

**న్యూజండ్ల మేజర్ న్యూస్:** ప్రస్తుతం వర్షాల నుంచి పంటలను కాపాడు కునేందుకు రైతులు వెంటనే యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి షేక్ సుగుణా బేగం తెలిపారు.పంట చేలో వాన నీరు కాలువలు ద్వారా బయటకు వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టి, నేలవాలిన చిరుపొట్ట, పాలు పోసుకునే దశలో ఉన్న వరి పైరును నాలుగైదు దుబ్బులను కలిపి కట్టలుగా కట్టి నిలబెట్టుకోవాలని తెలిపారు.చిరు పొట్ట దశలో ఉన్నట్లు అయితే పొలంలో నీరు తీసివేసి బూస్టర్ డోస్‌గా ఎకరాకు 30 కిలోలు యూరియా మరియు 15 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. బి.పి.టి 5204 కోతకు సిద్ధముగా ఉన్నందున వెన్నుల మీద గింజ మొలకెత్తే అవకాశం ఉంది కనుక పైరుపై కూడా వెన్నులు తడిచేలాగా 5% ఉప్పు ద్రావణాన్ని (50 గ్రాములు/లీటరునీటికి) పిచికారి చేసుకోవాలన్నారు. పడిపోయిన వరి పైరు మీద పొడ తెగులు ఉధృతి పెరగటానికి అవకాశం ఉంటుంది కనుక ప్రోపికోనజోల్ 1 మి.లీ లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ లేదా వ్యాలిడామైసిన్ 2మి.లీ/లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలని సూచించారు.

## ముంచిన మిచౌంగ్

(మొదటి పేజీ తరువాయి)

సహాయక చర్యలు చేపట్టారు. నియోజకవర్గాల వ్యాప్తంగా పర్యటన పర్యటిస్తున్నారు. అక్కడ ప్రత్యక్షమవుతున్నారు. సదుపాయాలకి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించారు. పరిశీలించారు. పొలాలను పరిశీలించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను, పంట పొలాలను పరిశీలించానన్నారు. పత్తి పంట సక్రమంగా లేకపోయినప్పటికీ మిర్చి పంటకు వర్షం అధికమవుతుందన్న భావన ఆయన వ్యక్తం చేశారు. వరి పంట కొన్ని ప్రాంతాల్లో నేలవారిన మరికొన్ని ప్రాంతాల్లో బాగానే ఉందని తెలిపారు. పోయిన రైతులకు నష్టపరిహారం అదే విధంగా చూస్తామన్నారు. ఎక్కడైనా లోతట్టు ప్రాంతాల్లో నీరు ఇళ్లల్లోకి చేరితే వారిని వేరే ప్రాంతాలకు మార్చి వారికి సహాయక చర్యలు చేపట్టామన్నారు.

# బీభత్సం సృష్టించిన మిచౌంగ్





**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

తీవ్ర తుపాను మిగ్‌జాం బాపట్ల సమీపంలో తీరం దాటింది. దీంతో తీరం వెంబడి గంటకు 90-100కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. రాగల 2 గంటల్లో మిగ్‌జాం తుపానుగా బలహీనపడనుంది. అనంతరం 6 గంటల్లో వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తుపాను తీరం దాటినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిగ్‌జాం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా పలు తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో నష్టం ఎక్కువగా జరిగింది. రాయలసీమ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లోనూ తుపాను ప్రభావం కనిపించింది. వరి, పొగాకు, పసుపు, అరటి పంటలు దెబ్బతిన్నాయి. తుఫాను ప్రభావంతో ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద భారీగా నీరు నిలిచిపోయింది. ఆస్పత్రి లోపల కూడా నీరు చేరడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. కృష్ణ డెల్టాలో పంటల పూర్తిగా పంటల నష్టం కోట్లలో ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బాపట్ల, తెనాలి, వేమూరు, పొన్నూరు, మంగళగిరి, ప్రత్తిపాడుతో పాటు పలు నియోజకవర్గాల్లో పంటలు దెబ్బతినిపోయాయి. వర్షం దాటికి అనేక చోట్ల గ్రామీణ రహదారులు చిన్నాభిన్నంగా మారాయి. పలుచోట్ల ప్రచండ గాలుల దాటికి రహదారికి అడ్డంగా చెట్లు కూలిపోయాయి. మెట్ట ప్రాంతాల్లో వేసిన, పొగాకు, మినుము, సెనగ పంటలు నీట మునిగాయి. పత్తి మిర్చి పంటలు కూడా పూర్తిగా దెబ్బ తగిలిపోయాయి. కాయల్లో లో ఉన్న పత్తి తడిసిపోయాయి. మిరప చెట్లు తోటల్లో నేల వాలిపోయాయి. వర్షం వెలిసిన తర్వాత పంట నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

# నాడు మాండౌస్.. నేడు మిచౌంగ్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

- **పంట చేతికొచ్చే దశలో వెంటాడుతున్న తుఫాన్లు**
- **సర్వం కోల్పోతున్న అన్నదాతలు**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డిసెంబరు నెలలో వస్తున్న తుపాన్లు కర్షకులకు కోలుకోలేని నష్టాలు మిగులుస్తున్నాయి. గతేడాది డిసెంబరు రెండోవారంలో వచ్చిన మాండౌస్ తుపాను వరి రైతులకు తీవ్ర నష్టం కలగజేసింది. ఇప్పుడు కూడా డిసెంబరు నెల తొలివారంలో మొదలైన మిగ్ జాం తుపాను రైతులకు తీవ్ర ఆందోళన కలగజేస్తోంది. డెల్టాలో చాప చుట్టేసిన వరి పొలాలు... పొలంలోనే తడిసిన ఓదెలు... ఇప్పుడు గుంటూరు, బాపట్ల జిల్లా పరిధిలో ఎటుచూసినా ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి. డిసెంబరు వచ్చిందంటే తుపానుల భయం రైతులను వెంటాడుతోంది. ఈఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి సాగునీటి కొరతతో ఇబ్బంది పడిన రైతులకు పంట కోత దశలో వచ్చిన తుపాను వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వరి పంట కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో నేలవాలితే నష్టం ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఎకరా కోత కోయడానికి యంత్రంతో గంటన్నర సమయం పడితే నేలవాలితే రెండు గంటలకుపైగా సమయం పడుతుంది. ఎక్కువగా నేలవాలితే మూడు గంటల సమయం కూడా యంత్రం పనిచేయాల్సి వస్తుంది. గంటకు రూ.2600 చొప్పున రైతు చెల్లించాలి. ఈలెక్కన నేలవాలితే అదనంగా పట్టే సమయం మొత్తం రైతుకు భారమే. దీనికితోడు నేలవాలిన తర్వాత నీరు నిలిస్తే ధాన్యం రంగు మారడంతో పాటు మొలక వచ్చే అవకాశం ఉంది. దీంతో ధాన్యం ధర తగ్గించి కొనుగోలు చేస్తారు. ఇలా అన్నివిధాలా రైతులకు కష్టాలే వెంటాడుతాయి. తుపాను కొనసాగడంతోపాటు బాపట్ల, నిజాంపట్నం మధ్య తీరం దాటుతుందన్న అంచనాలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

# ఆంధ్రాకు రూ.5 వేల కోట్లు ఇవ్వండి

- **మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు**
- **పార్లమెంటులో కేంద్రాన్ని కోరిన గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్**




**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

మిచౌంగ్ తుఫాన్ క్లో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ కి రూ. 5,000 కోట్లు. తక్షణమే విడుదల చేయాలని గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ మంగళవారం కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో మిచౌంగ్ తుఫాను ప్రభావంపై ఆందోళన కేంద్ర బృందాన్ని పంపి మధ్యంతర ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని ప్రభుత్వానికి గల్లా జయదేవ్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ లోప్రశ్నోత్తరాల సమయంలో కేంద్రం దృష్టికి తీసుకుచ్చారు. దక్షిణ ఏపీకి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుఫాను కారణంగా గత రెండు రోజులుగా చాలా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దిగువ కోస్తా ఆంధ్ర ప్రదేశ్‌లోని బాపట్ల, మచిలీపట్నం మధ్య ఎక్కడో మిచౌంగ్ తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. భారీ వర్షాల కారణంగా కోస్తా, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర జిల్లాల్లో వేలాది హెక్టార్లలో నిలిచిన పంట నాశనమైంది. ఈ తుపాను రైతులకు కన్నీళ్లు తెప్పించి, కోతకు సిద్ధంగా ఉన్న పంట కళ్ల ముందే పోతుంది, రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నష్టాన్ని గుర్తించి అంచనా వేసే పనిలో ఉంది, పంట, ప్రాణ, ఆస్తి నష్టం గురించి కొంత నిర్ధారణకు రావడానికి కొంత సమయం పట్టవచ్చు. భారీ వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిన్నాయి, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది, ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలతో పాటు నిత్యావసరాలు తెచ్చుకోలేకపోతున్నారు. ఈ విషయాల దృష్ట్యా, నేను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.. పంటలు, రోడ్లు, భవనాలు, విద్యుత్ సరఫరా, ఇతర మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర సహాయం విడుదల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించడానికి వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే కేంద్ర బృందాన్ని పంపాలని ప్రధాన మంత్రి, హెూం మంత్రినీ గల్లా కోరారు. మిచౌంగ్ తుఫాను కారణంగా సహాయ, పునరావాస పనులను ఎదుర్కోవడానికి తక్షణమే మధ్యంతర ఉపశమనంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ. 5,000 కోట్లు విడుదల చేయాలని పార్లమెంట్ సమావేశంలో కోరారు.

**CHANGE OF NAME**

I, Yeluri Nitya Poojitha(Old Name), D/o. Yeluri Srinivasa Rao, resident of D. No: 12-150/A, janapadu road, Kanyaka Parameswari temple, Piduguralla, Palnadu district, 522413, A.P. I have changed my name as Yeluri Nitya Pujitha(New Name), D/o Yeluri Srinivasa Rao, Hereafter my name is known as Yeluri Nitya Pujitha (New Name), D/o. Yeluri Srinivasa Rao.

# ప్రకృతి ప్రకోపానికి అన్నదాత విలవిల

## ముంచుకొచ్చిన తుఫాన్ ముప్పు.. కష్టాల్లో కర్షకులు





రెంటచింతల, మేజర్‌న్యూస్ మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుంది ప్రస్తుత రైతుల పరిస్థితి. మండలంలో ఖరీఫ్ కింద రైతులు 2094 హెక్టార్లలో వరి సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకున్న రైతులు ప్రస్తుత తుఫాను ప్రభావ పరిస్థితులకు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి నోటి వరకు వచ్చిన పంటని దక్కించుకునేందుకు అన్నదాతలు అష్ట కష్టాలు పడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో వచ్చిన ముప్పుతో ఏమి చేయలేక కర్షకులు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను పరిస్థితులు నెలకొనడంతో పొలంలో పంట ఉంటే దిగుబడి దెబ్బతింటుందని భావించి రూ.3 వేల అదనపు ఖర్చులతో రహదారి పక్కన తమ ధాన్యాన్ని నిల్వ చేసుకుంటున్నారు.మండలంలోని మంచికల్లు, పాలువాయి తదితర గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో ఎక్కడ చూసినా ధాన్యం రాశుల నిల్వలు దర్శనమిస్తున్నాయి. ప్రతికూల వాతావరణంతో చాలామంది రైతులు కోతలు కోయడానికి ఆసక్తి చూపకపోవడంతో ఇప్పుడు కురుస్తున్న ఎడతెరిపి వర్షాలు,ఈదురుగాలకు పంటలు దెబ్బతింటున్నాయి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రాయితీతో టార్పాలిన్ పట్టలు అందించాలని రైతులు కోరుతున్నారు. కాగా ప్రస్తుత తుఫాన్ పరిస్థితుల దృష్ట్యా సాధ్యమైనంతవరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని, పొలాల్లో నీరు నిల్వ లేకుండా కాలి బాటలు ఏర్పాటు, వర్షాలు తగ్గిన తర్వాత గింజలు దెబ్బ తినకుండా ఉండేందుకు 1 మి.లీ టిల్ట్ రసాయనిక మందు నీటితో కలిపి పిచికారి చేయాలని,పొలంలో కుప్పలు వేసిన పంట తడిస్తే5 శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేస్తే విత్తనాలలో మొలకలు రాకుండా నివారించవచ్చని రైతులకు ఈ సందర్భంగా వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు.

## పోలీసుల సేవలు ఉపయోగించుకోండి: ఎస్పీ రవిశంకర్ రెడ్డి



నరసరవుపేట, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుఫాను ప్రభావంతో జిల్లాలో పడుతున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి అన్నారు. మంగళవారం తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ వారు తగిన భద్రతా చర్యలు చేపడుతున్నారని అన్నారు. కావున సహాయక చర్యలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముంపు ప్రభావం ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించడం, వాగు పరివాహక ప్రాంతాల వద్ద పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయడం వంటి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి ఎక్కడ కూడా ప్రాణ,ఆస్థి నష్టం జరగకుండా పోలీస్ వారు తక్షణ సహాయక చర్యలు చేపడుతున్నారని అన్నారు. కావున ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు. ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడే చెట్లను, కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థకు, ప్రయాణాలకు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేయడానికి ప్రత్యేక బృందాలను నియమించడం జరిగినదని ఈ సందర్భంగా తెలిపారు. పాత భవనాల కింద, పెద్దపెద్ద వృక్షాల కింద ఉండవద్దని ముంపు ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉధృత ప్రవాహం సమయంలో కాలువలు దాటడం వంటివి చేయరాదని ప్రజలకు సూచించారు. ప్రయాణించేందుకు అనువుకాని మార్గాలు మరియు నీట మునిగిన రహదారులలో ప్రయాణించడం నిషేధం అని, అటువంటి ప్రాంతాల్లో పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి, రహదారులను మూసివేసి, ఇతర మార్గాల ద్వారా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం అని తెలిపారు. తుఫాన్ కారణంగా ఏమైనా ఘటనలు తలెత్తినా, అత్యవసర పరిస్థితి వచ్చినా, ఏ విధమైన సమస్యలకు గురైనా ప్రజలు, వెంటనే మీ పట్టణ లేదా మండల పరిధిలో ఉండే పోలీస్ అధికారులకు గానీ, 100 లేదా 112 లకు ఫోన్ చేసి సమాచారం తెలపాలని, జిల్లా పోలీస్ యంత్రాగం 24%ఇ%7 అందుబా టులో ఉంటుందని జిల్లా యస్.పి తెలిపారు.

## తుపాను ప్రభావిత రైతులకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాలి: ప్రత్తిపాటి



చిలకలూరిపేట, మేజర్‌న్యూస్: ఖరీఫ్ ప్రారంభం నుంచీ కష్టాలకు ఎదురీదుతూ, ఇప్పుడు తుఫాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఉమ్మడి గుంటూరు జిల్లా రైతన్నలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. ఆఫీసు గదుల్లో కూర్చుని సమీక్షలు చేయడం కాకుండా నిండా మునిగిన పంటచేలల్లో పర్యటిస్తే ప్రభుత్వం, అధికారులకు కూడా అన్నదాతల కష్టాలు కనిపిస్తాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండురోజులుగా వణికిస్తున్న తుపాను ప్రభావంపై స్థానిక రైతులు, నాయకుల నుంచి వివరాలు సేకరించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రత్తిపాటి నష్టపోయిన వారికి యుద్ధప్రాతిదిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తీవ్ర తుపాను కారణంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని దాదాపు అన్ని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. మిరప, పత్తి, మొక్కజొన్న, పసుపు, శనగ పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. అసలే కరవు పంజా కారణంగా ఈసారి వానాకాలం సీజన్ మొదటి నుంచి ప్రతికూలంగానే సాగిందని, వర్షాభావంతో విత్తనాలు వేయడం ఆలస్యమైందని అన్నారు. జులైలో వర్షాలు కురిసినా తర్వాత ముఖం చాటేయడంతో అనేక సవాళ్లను దాటుకుని పంటల్ని కాపాడుకున్న రైతులకు ఇప్పుడు తుపాను రూపంలో ఊహించని విపత్తు వచ్చిపడిందని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రధాన పంటలుగా ఉన్న మిరప, పత్తి, మొక్కజొన్న, పసుపు, శనగ ఈదురుగాలులకు పూత, కాయ రాలిపోయిందని తెలిపారు. లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టిన రైతుల్ని ఇప్పుడు సకాలంలో ఆదుకోకపోతే వారికి ఆత్మహత్య దిక్కవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## తుఫాను బాధితులు ధైర్యంగా ఉండాలి: వైసీపీ యువ నేత విడదల గోపి

చిలకలూరిపేట, మేజర్‌న్యూస్: తుఫాన్ ప్రభావానికి పట్టణంలోని పలు ప్రాంతాలు నీట మునగగా మంత్రి విడదల రజిని ఆదేశాల మేరకు పలు చోట్ల ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్టు వైసిపి యువ నాయకులు విడదల గోపీ తెలిపారు. బాధితులకు భోజన సదుపాయాలు కల్పించినట్టు ఆయన వివరించారు. బాధిత ప్రజలతో మాట్లాడుతు వారి యోగ క్షేమాలు తెలుసుకుంటూ తుఫాను ప్రభావ ప్రాంతాలలో ఆయన పర్యటన చేస్తున్నారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.



## తుఫాను ప్రభావం కారణంగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే కాసు



పిడుగురాళ్ల టౌన్, మేజర్‌న్యూస్: పిడుగురాళ్ల ఆర్ అండ్ బి బంగ్లాలో మంగళవారం అధికారులతో సమీక్షించారు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి తుఫాన్ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి సాధ్యమైనంత వరకు ఆస్తి నష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టం జరగకుండా రైతులను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు తగిన సూచనలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా విపరీతమైన వర్షపాతం పల్నాడు ప్రాంతంలో రాష్ట్రంలో నెలకొన ఉంది. తుఫాను వల్ల ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పరిస్థితులు చేయి దాటి పోకుండా అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణానికి నీళ్లు ఇవ్వాలనే సంకల్పంతో మొట్టమొదటిసారిగా రెండు సంవత్సరాల నుండి పట్టణానికి కృష్ణా నీళ్లు ప్రతిరోజు ఉదయము, సాయంత్రం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గత వారం రోజుల నుండి పట్టణంలో నీళ్లు ఇవ్వటం చాలా వరకు తగ్గింది. దానికి కారణం ఇక్కడ మోటార్లు రిపేర్లు రావడం, పులిచింతల బ్యాక్ వాటర్ తగ్గడం. ఫిల్టరేషన్ ప్లాంట్ వరకు రావాల్సింది చాలా లోపలకు రావడం కారణం. ఇప్పటికే ఇంజనీర్లు కష్టపడి రెండు మూడు మోటర్లు తీసుకొచ్చి పెట్టారు. ఇంకో ఆరు మోటర్లు పెంచుకోగలిగితే రాబోయే వేసవికాలంలో ఎటువంటి ప్రాబ్లమ్స్ వచ్చినా దాన్ని అధికమించి మనం అనుకున్నట్లు పట్టణానికి నీళ్లు ఇవ్వొచ్చు. ఆరు మోటర్లు ఏర్పాటు చేసుకొని రేపు రాబోయే వేసవి కాలానికి సమాయత్తం అవుతామని అన్నారు. ఏది ఏమైనా తప్పకుండా ప్రతి ఇంటికి పైప్ లైన్ ద్వారా శుద్ధి చేసిన కృష్ణా నది నీటిని ఇచ్చే భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు ఇప్పటికే తొమ్మిది వేల కనెక్షన్లు సిద్ధం చేశాం రేపు సంక్రాంతి కల్లా మరొక వెయ్యి కనెక్షన్లు ఇచ్చి 10 వేల కనెక్షన్లు పూర్తి చేస్తామన్నారు. అలాగే వచ్చే జూన్, జూలై కల్లా మిగిలిన ఇళ్లకు కూడా కనెక్షన్లు ఇచ్చి పట్టణంలో ఉన్న ప్రతి ఇంటికి తాగునీరు అందించేటట్లు వైయస్ఆర్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మాచవరం మండలం గోవిందాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ను అధికారులతో ఎమ్మెల్యే పరిశీలించారు.ఇప్పటికే రైతులు పత్తిని చాలా శాతం పీకేసారని చెప్పారు. మిర్చి పంటకి నీరు ఎక్కువగా కావాలి వరుణ దేవుడు కరుణించి సకాలంలో వానలు పడుతున్నాయి. మళ్లీ జనవరి, ఫిబ్రవరిలో ఎలా ఉంటుందో అధికారుల అందరితో సమీక్షించుకొని ఏమి చర్యలు చేపట్టంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# రైతులు పట్ల శాపంగా మారిన జగన్మోహన్ రెడ్డి పాలన : దూళిపాళ్ల నరేంద్ర కుమార్



పొన్నూరు మేజర్ న్యూస్ : వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగేళ్లలో వ్యవసాయాన్ని నిర్లక్ష్యానికి గురైందనిమాజీ ఎమ్మెల్యే సంఘం డైరీ చైర్మన్ దూళిపాళ్ల నరేంద్ర కుమార్ దుయ్యబట్టారు. పొన్నూరు మండలం పరిధిలోని పచ్చలతాటిపర్రు, మునిపల్లె, గొళ్ళమూడిపాడు,వెల్లలూరు గ్రామాల్లో తుఫాన్ కారణంగా ముంపుకు గురైన వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నలకు కష్టం వచ్చినప్పుడు ఏనాడూ వైసిపి ప్రభుత్వం వారికి ఆత్మస్థైర్యాన్ని ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తుఫాన్ సహాయ చర్యల్లో వైసిపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు .తుఫాన్ సహాయ చర్యల్లో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన పేర్కొన్నారు.జోరు వర్షంలోనూ నరేంద్ర కుమార్ గారు పర్యటించి కుండపోతు వర్షంతో పంట నీట మునిగిన వరి పొలాలను పరిశీలించడంతోపాటు పంటలను కోల్పోయి తీవ్ర నిర్వేదంలో ఉన్న రైతులను అన్వయించి వాళ్లలో భరోసా నింపారు. నీట మునిగిన వరి పొలాలను చూపించిన రైతులు నరేంద్ర కుమార్ వద్ద తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా పండించిన పంట వర్షాలు, తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న తమను ఎవరు ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పరామర్శకు కూడా తాము నోచుకోలేక పోయామని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు.గత నాలుగు, ఐదు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన పెను తుఫాను ప్రభావం కోస్తా జిల్లాలపై తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం రైతులను ప్రజలను, హెచ్చరించడంలో మీనమేషాలు లెక్కించడం దారుణం అన్నారు. వైకాపా ప్రభుత్వం ప్రచారం కోసం చేస్తున్న ఖర్చు రైతులు ఆదుకోవడం పై శ్రద్ధ చేయడంలో లేదని ఈ సందర్భంగా తెలియజేశారు. రైతులు పండించిన పంట నీటి పాలు అవుతుంటే తమకు తీవ్ర ఆవేదన కలుగుతుందని నరేంద్ర కుమార్ విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికీ రైతులు నాలుగేళ్లుగా పంటలు కోల్పోయి తీవ్ర నష్టాల్లో ఉన్నారని నీట మునిగిన పంట పొలాలను రైతుల కష్టాలను చూచి అయినా ప్రభుత్వం గుర్తించి వారిని న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీట మునిగిన ప్రతి పంట పొలాన్ని గుర్తించి పంట నష్టపరిహారం ప్రతి రైతుకు ప్రతి ఎకరాకు రూ .30,000 నుండి రూ .50000 రూపాయల వరకు నష్టం పరిహారం అందించాలని, తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చెయ్యాలని వైకాపా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ ఎలక్షన్ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదల వెంకటేశ్వరరావు, గుంటూరు పార్లమెంటరీ రైతు విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, యలవర్తి శేషగిరిరావు, యంపరాల గోపి మల్లంపాటి శ్రీనివాస్, నాగభైరవ పూర్ణచంద్రరావు, అత్తోట వెంకట అప్పారావు, చిలుమకూరి వెంకటేశ్వరరావు, పటాన్ భాష, గనిపిశెట్టి రామకృష్ణ, పటాన్ వలి, గూడపాటి కాళేశ్వరరావు, పుప్పాల హరిబాబు, శివయ్య,యాలవర్తి వీరయ్య,మణి బాబు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానానికి నసీమ చారిటబుల్ ట్రస్ట్ సాయం

## స్వాములకు నిత్యావసరాలు అందజేసిన రమేష్



తెనాలిరూరల్,మేజర్ న్యూస్ : రూరల్ మండలం కొలకలూరు గ్రామం బోయవారి పుట్ట వద్ద ప్రతి ఏటా జరుగే 41 రోజుల అయ్యప్ప స్వాములు నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఒకరోజు అన్నదానానికి అవసరమైన నిత్యవసరాలను నసీమ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు,జిల్లా భారతీయ జనతా పార్టీ ఆర్టిఐ జిల్లా కన్వీనర్ కాలిశెట్టి రమేష్ బాబు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామానికి నా వంతు సహాయం చేయటానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నానని, సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఐ సభ్యులు చింతల గోపికృష్ణ, కొచ్చర్ల శ్రీనివాసరావు,గుంటూరు రజిని,బండి చంద్రమోహన్,ఏపూరి వెంకట సత్యనారాయణ,దూళ్ళ శ్రీనివాసరావు,స్వాములు పసుపులేటి సురేష్ (గురుస్వామి),గట్టు నాగరాజు,నాగినేని హేమంత్,పవన్ కుమార్,కొండేపల్లి రాము,అచ్చంశెట్టి శివ నాగేశ్వరరావు,పాత కోటి వెంకటేశ్వరరావు,గమిడి శ్రీనివాసరావు,కుప్పాల అర్జునరావు,కొలకలూరి దుర్గారావు,కాలిశెట్టి సాయి పాల్గొన్నారు.

# జనజీవనాన్ని అస్తవ్యస్తంగా మార్చిన మిచాంగ్ తుఫాన్



పొన్నూరు మేజర్ న్యూస్ మిచాంగ్ తుఫాన్ బాపట్ల చీరాల మధ్య తీరం దాటిన కారణంగా పొన్నూరు పట్టణం మండల పరిధిలో ఈదురుగాలులతోపాటు విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజా జీవనం స్తంభించడంతోపాటు రైతుల, బాధితుల బాధలు వర్ణనాతీతం గా మారింది. చేతికి అందిన పంట నీట మునగడంతో రైతులు కన్నీటి పాలవు తున్నారు. పంట పొలాలలో నీరు నిలవడంతో చేతి కందిన పంట మొలకెత్తి మొక్కలు వస్తున్నాయి. తీవ్ర మైన గాలులు వీచతంతో పాత భవనాలు నేలకొరకుటంతో పాటు చెట్లు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొన్నూరు పట్టణంలోని రోడ్లు జలమయమయ్యాయి. డివిసి కాలనీ యానాది కాలనీ డి ఆర్ కే కాలనీ , ఇందిరా కాలనీ పూర్తిగా నీట మునిగాయి. జీబీసీ రోడ్డులో ఉన్న రహదారి విస్తరణ బాధితుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. రోడ్డును విస్తరణ అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో రోడ్డు మార్జిన్లలో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచి గృహ, దుకాణ సముదాయాలకు భారీగా వర్షపు నీరు చేరింది. ఆ ప్రాంతం నుంచి ప్రయాణించే వాహనముల రాకపోకలతో నిలిచిన వర్షపు నీరు గృహ సముదాయంలోకి, సెల్లార్ లోకి చేరింది. బురద నీటిలో, వర్షపు నీటిలోనే వ్యాపారాలు చేసుకుని రావడం, జీవనం సాగించవలసి రావటంతో భవన యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఆ ప్రాంతం నుండి వెళ్లే వాహనదారులు రహదారిపై వర్షపు నీళ్లలో ఉన్న గుంతలు కనపడక జారిపడుతున్నారు. అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో నష్టం నివారణ జరగలేదు. అధికా రులు స్పందించి బాధితులను ఆదుకోకపోతే జనజీవనం మరింత చిన్నాభిన్నమయ్యే పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సహాయక చర్యలు ముమ్మరం చేస్తారని ఆశిద్దాం

# మిచౌంగ్ తుఫాన్ కోసం రవాణా శాఖ సంసిద్ధం



గుంటూరు వైద్య మేజర్ న్యూస్ : తుఫాన్ నుండి ప్రజలను కాపాడటానికి సర్వం సిద్ధం చేసినట్లు ఉప రవాణా కమిషనర్ ఎస్ డి కరీం వివరించారు ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ మిచౌంగ్ తుఫాను దృశ్య ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గుంటూరు జిల్లా రవాణా శాఖ ఇతర శాఖల అవసరాల నిమిత్తం అన్ని రకాల వాహనాలను సిద్ధంగా ఉంచడం జరిగినది. గుంటూరు జిల్లా నుంచి కృష్ణా జిల్లాకు మిచౌంగ్ తుఫాను వలన కలుగు విపత్తు నిమిత్తం ధాన్యం సరఫరా చేయటానికి గుంటూరు జిల్లా అధికారుల యొక్క ఆదేశాలు మేరకు కృష్ణా జిల్లాకు 50 లారీలను సరఫరా చేయడం జరిగినది. ఇందు నిమిత్తం గుంటూరు జిల్లా రవాణా శాఖ యొక్క ఉప రవాణా కమిషనర్ ఆధ్వర్యంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు అందరూ కలిసి 50 లారీలను సమీకరించి కృష్ణా జిల్లా లోని వివిధ ప్రాంతాలైన మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడ కు పంపించడం జరిగినది. అంతేకాకుండా గుంటూరు జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు స్కూల్ బస్సులను సిద్ధంగా ఉంచడం జరిగినది. అలాగే జిల్లా యంత్రాంగం యొక్క ఆదేశాలు మేరకు ఈ మిచౌంగ్ తుఫాను యొక్క విపత్తు సమయంలో రవాణా శాఖ అత్యవసర సేవలు అందించేందుకు సంసిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

# మిఛాంగ్ తుఫాన్ దెబ్బకి అల్లాడిపోతున్న రైతన్నలు



దుగ్గిరాల, ఓమేజర్ న్యూస్ : రెక్కాడితే కానీ డొక్కాడని రైతన్నలు ఏడాదికాయేడు సేద్యం చేసి ఆరు కాలం కష్టించి పండించిన వరి పంటకు వాయు దేవుడు అడ్డంకులు వేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మిచాంగ్ తుఫాను దుగ్గిరాల మండలంలో తీవ్ర నష్టాన్ని చేకూర్చే దిశగా గత రెండు రోజుల నుండి ఎడతెర.పి లేకుండావర్షాలు పడటంతో ఇప్పటికే 10,000 ఎకరాలలో వరి పైరు నేలకొరిగిందని ,500 ఎకరాల్లో మినుము పంట కు. నష్టం జరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు .దుగ్గిరాల మండల వ్యాప్తంగా మిచాం గ్ తుఫాను ప్రభావంతో వరి పంటను కాపాడుకునేందుకు మండల పరిధిలోని రైతన్నలు అష్ట కష్టాలు పడుచున్నప్పటికీ వరుణుడు కనికరించక ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులతో రైతన్నలను నిలవనీయకుండా పరుగులు పెట్టే దిశగా వర్షపు జల్లులను పైనుండి జారవిడుస్తున్నాడు. మిచాం గ్ తుఫాన్ వాయుగుండంగా మారడంతో సోమవారం, మంగళవారం నుండి ఏకధాటిగా వర్షం కురవడంతో మండల గ్రామాలలో వరి పంటకు భారీ నష్టం చేకూరినట్లుగా రైతన్నలు లబోదిబో అంటున్నారు .పొలాల్లో కోతకు. వచ్చిన పంట నీటిలో తేలియాడుతూ పడిపోవడం, పచ్చ పచ్చని కనువిందుగా కనిపించే పంటచేలు ,నేలకు వరగడంతో రైతుల గుండెలు గుభేలు మంటున్నాయి. తుఫాన్ హెచ్చరికలతో అనేక గ్రామాల్లో కొన్నిచోట్ల ముందుగానే కంటెంట్ హార్వెస్టర్ మిషన్ ద్వారా పంట కోతను కోసి వరి ధాన్యాన్ని టా ర్పా లిన్ పట్టాలతో కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. . తుఫాన్ దెబ్బకి పడిన వరి పైరును రక్షించుకునేందుకు రైతులు వరి చేలల్లో. దిగి చిన్న పిల్ల లను లాలించినట్లుగా వైర్ పైరును సుకుమారంగా నీటి నుండి పైకి తీస్తున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 20,000 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా తుఫాన్ దెబ్బకి పదివేల ఎకరాల్లో వరి పైరు నేలమట్టం అయినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేసినట్లు తెలుస్తోంది అదే విధంగా 500 ఎకరాల్లో మినుము నేలకొరగ.డంతో రైతన్నలు లబో దిబో అంటున్నారు .వరి సాగు కు. ఇప్పటి వరకు ఎకరాకు 20,000 రూపాయల పెట్టుబడులు పెట్టామని ,పంట చేతికి వచ్చే సందర్భంలో వరుణుడు తుఫాను రూపంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వరి పంట నేలకొరిగిందని , చేసిన అప్పులు తీరవని అన్నదాతల ఆశలు ఆవిరి అయిపోయాయని. అంటున్నారు. ఖరీఫ్ పంట కోసం చేసిన అప్పులు పెరిగిపోతాయని. ఏడాది పాటు చేసిన కష్టం కూడా మిగిల లేదంటూ రైతులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు . మిచాంగ్ తుఫాన్ తాకిడికి వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేసినప్పటికీ, రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధిక శాతం వరి పైరు నేలకొరిగింది . ప్రత్యామ్నాయఏర్పాట్లు కోసం రైతన్నలు పలు విధాలుగా శ్రమ పడుతున్నప్పటికీ, తుఫాను తాగడికి వర్షం జోరుగా పడటంతో రైతులు ఏమి చేయలేని పరిస్థితిలో గట్టు వెంబడే నిలబడి ,ప్రేమతో మరోవైపు ఆవేదనతో పైరువంక చూడక తప్పడం లేదు. మంగళవారం మండలంలో తుఫాన్ వాయుగుండం ప్రభావం వలన నష్టపో యిన పంటలను పరిశీలించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా పర్యటించి వివరాలను . సేకరిస్తున్నారు .మండల వ్యవసాయ అధికారి పి. శిరీష తుఫాను తాకిడికి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి రైతన్నలకు త క్ష ణ ఏర్పాట్లపై సూచనలు చేస్తున్నారు.

# విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవకులకు సత్కారం



మంగళగిరి మేజర్ న్యూస్: అంతరాజతీయ వాలంటీర్స్ డే సందర్భంగా విజయ హెల్త్ కేర్ ట్రస్ట్, బీ.సీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో, పలు స్వచ్ఛంద సేవకులకు సన్మానం నిర్వహించారు. మంగళవారం మంగళగిరి కార్యాలయంలో ప్రజలకు సేవలు అందిస్తున్న పలువురు వాలంటీర్స్ కి ఘన సత్కారాలు చేసి షీల్డ్ అందచేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో సమయాన్ని కేటాయిస్తూ ఆపదలో ఉన్న వారిని సొంత కుటుంబ సభ్యులుగా ఆదరిస్తూ ప్రజలకు అతి చేరువలో ఉంటున్న వాలంటీర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ స్వాతి గౌడ్ ని వారి టీం ని, శాలువాతో సత్కరించి అభినందించారు.. రేవేంద్రపాడులో పలు రకాల సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తూ ప్రజలకు చేరువలో ఉంటున్న వాలంటీర్ మహేష్ ని ప్రత్యేకంగా సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, అవ్వారు సుబ్బారావు, ట్రస్టు బోర్డు మెంబర్ బొడ్డేటి రమేష్, ట్రస్ట్ మెంబర్ కాటూరి శ్యామ్ ట్రస్ట్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## తుఫాన్ కారణంగా మూత పడిన మగ్గాలు : గుత్తికొండ ధనుంజయరావు



మంగళగిరి మేజర్ న్యూస్: మిచౌంగు తీవ్ర తుఫాన్ కారణంగా మంగళగిరి నియోజకవర్గంలో చేనేత పరిశ్రమ అతలాకుతులమైంది. తుఫాన్ కారణంగా వేలాది చేనేత మగ్గాలు మూతపడ్డాయని తెలుగుదేశం పార్టీ చేనేత విభాగం రాష్ట్ర నాయకులు గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. మంగళవారం గుత్తికొండ మాట్లాడుతూ గత రెండు రోజులుగా చేనేత కార్మికులు ఉపాధిని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, మరో వారం రోజులు పాటు చేనేత మగ్గాలు పనిచేయటానికి వీలు పడదని అవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం తక్షణం ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికునికి తక్షణం 5 వేల రూపాయల సహాయం, 50 కేజీల బియ్యం చేనేత కార్మికులకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



పెదకాకాని మేజర్ న్యూస్ : మిచౌంగ్ తుఫాను కారణంగా నీట మునిగిన పంట పొలాలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు మండల వ్యవసాయ అధికారి పి సంధ్యారాణి తో కలిసి పరిశీలించారు మండల పరిధిలోని పెదకాకాని గోళ్ళ మూడీ నంబూరు ఉప్పలపాడు తక్కెళ్ళపాడు వెంకట కృష్ణ పురం అనమ ర్లమూడి తంగెళ్ళమూడి గ్రామలలో మిచాంగ్ తుఫాన్ కారణంగా పొలాలలో వరి పంట గాలికి మొత్తం నేలమట్టమైనది పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు పొలాల నుండి నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే బయటికి పంపించాలని మొలకెత్తే అవకాశం ఉన్నచోట ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



పెదకాకాని మేజర్ న్యూస్ : మిచౌంగ్ తుఫాను కారణంగా నష్టపోయిన రైతన్నలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మండల సిపిఎం కార్యదర్శి నడపని శివాజీ డిమాండ్ చేశారు తుఫాను కారణంగా మంగళవారం పెదకాకాని మండల పరిధిలోని పెదకాకాని నంబూరు ఉప్పలపాడు తక్కెళ్ళపాడు వెంకట కృష్ణ పురం అనమ ర్లమూడి తంగెళ్ళమూడి గోళ్ళమూడి గ్రామాల్లో తుఫాను కారణంగా పొలాలలో వరి పంట నేలమట్టమైన పంటను సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మండల కౌలు రైతు సంఘం నాయకులు సంకురి నీలాంబరం క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే విత్తనాలకు బలం మందులు పురుగు మందులకి పెట్టుబడి రూపంలో రైతన్నకు చాలా ఖర్చు అయిందని పంట చేతికి వచ్చే సమయంలో లో తుఫాను కారణంగా మొత్తం నేలమట్టం అయిందని నష్టపోయిన రైతులను కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు

# గుడ్డి గుర్రాలు ఇకనైనా కళ్ళు తెరవాలి

తుళ్లూరు మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కాదని, మూడు రాజధానులతోనే ఆకాశం ఊడి ఏపీపై పడుతోందని ప్రచారం చేసిన వైకాపా నాయకులు, గత తెదేపా ప్రభుత్వం అమరావతిని ఏనాడో చంపేసిందని, దానిని వైకాపా ప్రభుత్వం పూడ్చేసిందని జ్యోతిష్యం చెప్పే గుడ్డి గుర్రాలు కేంద్ర ప్రభుత్వ ప్రకటనతోనైనా కళ్ళు తెరవాలని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య హితవు పలికారు. మంగళవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. దేశంలోని 28 రాష్ట్రాల రాజధానులకు రాజ్యాంగలోని 12వ షెడ్యూల్ ప్రకారం మాస్టర్ ప్లాన్ ఆమోదం ఉందని, ఏపీకి కూడా రాజధాని అమరావతి ఆమోదం ఉందని రాజ్యసభలో కేంద్ర మంత్రి చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వం మూడేళ్ళు, కొత్త ప్రభుత్వం ఐదేళ్ళు పాలన చేసిందీ, చేస్తున్నదీ అమరావతి నుంచే అన్నారు. రాజధానికి రక్షణ కవచంగా ఏర్పాటు చేసిన శాసన సభ తీర్మానాలు, సిఆర్డిఎ చట్టాలు, ఫాం నెంబర్ 14 వంటి అంశాలే న్యాయస్థానాలలో నెగ్గాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వం అలాంటి ముందు జాగ్రత్తలు ఎన్నో తీసుకుందని, కేవలం ముఖ్యమంత్రి రాజధానిపై పై రాజకీయ యుద్ధం మొదలెట్టారని పేర్కొన్నారు. రాజధానిపై ప్రభుత్వం వేసిన బండరాళ్లు చాలక, కొత్తగా కొందరు గులకరాళ్ళు వేసే ప్రయత్నం చేస్తున్నారని, బండరాళ్ళను బద్దలు కొట్టిన రాజధాని మహిళలు, బహుజన ఉద్యమ కారులు గులక రాళ్ళను కాళ్ళతో తోసేస్తారని చెప్పారు. రాజధానిపై రాళ్ళేసినా, అమరావతి మహిళలపై నిందలు వేసినా చరిత్ర క్షమించబోదని హెచ్చరించారు. నాలుగేళ్లుగా రాష్ట్రానికి రాజధాని లేకుండా, అమరావతిపై మహాదాడి చేసిన ప్రభుత్వ వైఖరితో జత కడితే, ప్రజలు ఇటువంటి వారినీ పక్కన పెడతారని తెలిపారు. రాష్ట్రంలో 67 రాజకీయ పార్టీలు ఉన్నాయని, వీటిలో 60 పార్టీలు ప్రజలకు తెలియవని చెప్పారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు పుడుతుంటాయి, గిడుతుంటాయి అనీ, ఏ రాజకీయ పార్టీ అయినా స్పష్టమైన విధానాలతో, కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లి పని చేసుకోవడంలో తప్పు లేదని పేర్కొన్నారు. రహస్య ఎజెండాలతో పని చేస్తే, రాజకీయ సొంత పంచాంగాలు చదివితే, అది ప్రభుత్వానికే ఉపయోగపడుతుందన్నారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని, రోజుకు ఆరు వీడియోలు చేసినా, 12 వీడియోలు పెట్టినా ప్రజలు నమ్మేస్తారనో, ఓట్లు వేస్తారనో భ్రమించటం రాజకీయ అపరిపక్వత అవుతోందని పేర్కొన్నారు. మూడు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో భాధ్యతతో పోరాడాల్సిన శక్తులు పోరాడుతూనే ఉన్నాయని, తాము ఆశించిన 'రహస్య' ఫలితాలు అందలేదని, ప్రజల మీద, ఉద్యమాల మీద దుమ్మేస్తే, అది ప్రభుత్వ విధానాలకు ఊడిగం చేసినట్లే అవుతుందని బాలకోటయ్య హెచ్చరించారు.

## తాడికొండ లోని పలు ప్రాంతాల్లో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ పర్యటన



తాడికొండ మేజర్ న్యూస్: మంచౌ తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాడికొండ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ మంగళవారం పర్యటించారు తుఫానును సైతం లెక్కచేయకుండా భారీ వర్షం లో ఆయన పంట పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని అక్కడికి తరలి స్తున్నామని చెప్పారు అనారోగ్యం తో ఉన్నవారిని వైద్యశాలకు తరలించామని తెలియ జేశారు ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కత్తెర సురేష్ కుమార్ వారిని కోరారు అధికంగా ప్రతి మిర్చి జొన్న వరి సెనగ పంటలు ఉన్నాయని తెలిపారు ప్రభుత్వపరంగా కావలసిన సదుపాయాలు ఏర్పా టు పై అధికారులతో మాట్లాడుతానని కత్తెర సురేష్ కుమార్ చెప్పారు మరి కొద్ది రోజులు వర్షం పడితే రైతులకు ఇంకా తీవ్ర నష్టం వాటిల్లే ప్రమా దం ఉందని అధికారులు చెప్పారు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను కత్తెర సురేష్ కుమార్ కోరారు తుఫాను కారణంగా అధిక వర్షాలు పడుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంట నష్టపోతే ముందుగా రైతు భరోసా కేంద్రంలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కు తెలియజేయాలని సూచించారు రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు కొంతమంది రైతులు 100 ఎకరాలు 80 ఎకరాల్లో పంటలు వేసి నష్టపోయారని అదేవిధంగా సన్న చిన్న కారు రైతులు కూడా నష్టపోవటం తనను బాధించిందని తెలిపారు ప్రభుత్వం అందర్నీ ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని చెప్పారు ఎవరు ఆందోళన చెందవద్దని కోరారు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నారని ఈ మేరకు ప్రతి జిల్లాకు నిధులు విడుదల చేశారు అని చెప్పారు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు పంట నష్టాన్ని అం చనా వేసి పరిహారం అందజేస్తారని తెలియజేశారు.

# తుఫాన్ దెబ్బకు అస్తవ్యస్తంగా మారిన రోడ్లు రహదారులు



దుగ్గిరాల, మేజర్ న్యూస్ : తుఫాన్ దెబ్బకు దుగ్గిరాల మండలంలోని రోడ్లు రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజుల నుంచి వర్షంతో పాటు ఈదురుగాలులు రావడంతో ప్రజాజీవనం స్తంభించడంతోపాటు ఇటు ప్రజలు అటు రైతులు పడుతున్న బాధలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. చేతికి అందిన పంట నీట మునగ.డం తో రైతులు కన్నీటి పాలవుతుండగా, రోడ్లు రహదారులు నీటిమయం కావడంతో ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మంగళవారం వర్షంతో పాటు తీవ్రమైన గాలులు వీచడంతో పలుచోట్ల చెట్లు నేల కొరిగిపోయి, విద్యుత్ సరఫరాకు ఉదయం నుండి అంతరాయం ఏర్పడడంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అస్తవ్యస్తంగానున్న మండలంలోని పలు రోడ్లు రహదారులు పై తుఫాన్ దెబ్బకు జలమవడంతో రోడ్లపై ఏర్పడిన గుంటల వలన వాహనాలు అదుపుతప్పడంతో పలు ఇక్కట్లకు గురవుతున్నారు .లోతట్టు ప్రాంతాలకు నీరు చేరడంతో పలు కాలనీ ల నుండి ప్రజలు బయటకు వచ్చేందుకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్లపై నిలిచిన నీళ్లలో తో పాటు గుంటల్లో నీరు చేరడంతో వృద్ధులు, చిన్నారులు గర్భిణీలు బయటకు వచ్చేందుకు జం.కు తున్నారు. ఇప్పటికైనా తుఫాను దెబ్బకు అస్తవ్యస్తమైన రోడ్లను రహదారులను, మెరుగుపరిచి ప్రజా జీవనానికి అసౌకర్యం లేకుండా తగు విధంగా మెరుగులు దిద్దవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రజలు అధికారులను పదేపదే కోరుకుంటున్నారు.

## ప్రచార ఆర్భాటాలు తప్ప ప్రజలను ఆదుకునేది లేదా : మొహమ్మద్ నసీర్



గుంటూరు, మేజర్ న్యూస్: మీచాంగ్ తుఫాను ప్రభావంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ప్రగతి నగర్ తో పాటు పలు ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న అవస్థలను తెలుసుకొని స్థానిక నాయకులు తో కలిసి అక్కడికి చేరుకొని వారి సమస్యలను తెలుసుకుంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వారికీ అండగా ఉంటామని చెప్తున్నా గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జి మొహమ్మద్ నసీర్, ఈ సందర్బంగా నసీర్ గారు మాట్లాడుతున్నా కొన్ని రోజుల ముందే తుఫాను ప్రభావాన్ని గుర్తించిన అధికారులు స్థానిక లోతట్టు ప్రాంతాల్లో ఎటువంటి సదుపాయాలను సమకూర్చలేదని గుంటూరు తూర్పు నియోజకవర్గం లోని చాలా ప్రాంతాల్లో రోడ్లు ఇల్లులు జలమయవై ప్రజల ఇళ్లలో నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడ్డాయని కనీసం వారికి మంచినీటి సదుపాయం కూడా లేదని చీకటి లో ప్రజలు మగ్గుతున్నారని నగర కమిషనర్ గారు, స్థానిక వైసీపీ నాయకులు, అధికారులు ప్రచార అర్భటాల్లో ఉన్న నిబద్ధత ఇక్కడ కనిపించటం లేదని సత్వరమే అధికారులు రంగంలోకి దిగి జలదిగ్బంధంలో ఉన్న ప్రజలకు సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం ఈ విషయంలో పూర్తిగా విఫలమైందని స్థానిక %మీరా% ఇప్పటికైనా బయటకు వచ్చి ప్రజల సమస్యలను చూడాలని కనీసం మంచినీరు, విద్యుత్ సదుపాయం, వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో ఉన్నాడని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యల్లావుల అశోక్, పఠాన్ జమీర్, బట్టా రాజా, అల్లం బాజీ, ఉస్మాన్, యాసీన్ పాల్గొన్నారు.




# విద్య, ఉద్యోగ సమాచారం



**సెంట్రల్ యూనివర్సిటీస్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్ 2023**

దేశ వ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల్లో రెగ్యులర్, పర్మనెంట్ ప్రాతిపదికన.. పలు ఉద్యోగాల భర్తీకి ఉద్దేశించిన సెంట్రల్ యూనివర్సిటీ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ 2023 నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద సెంట్రల్ యూనివర్సిటీల్లోని నాన్ టీచింగ్ నియామకాలు చేపట్టనున్నారు. సెంట్రల్ యూనివర్సిటీస్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్-2023 ఆధారంగా మొత్తం 150 పోస్టులను భర్తీ చేయనున్నారు. న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) లో జూనియర్ అసిస్టెంట్-కమ్ టైపిస్ట్-50 పోస్టులు, స్టెనోగ్రాఫర్- 52 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మోతిహారి (బీహార్)లోని మహాత్మా గాంధీ సెంట్రల్ యూనివర్సిటీలో 48 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సంబంధిత పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు పోస్టును బట్టి పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత పొంది ఉండాలి. రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంజీసీయూ/ ఇగ్నోలలో ఆన్‌లైన్ దరఖాస్తులకు డిసెంబర్ 21, 2023 చివరి తేదీగా నిర్ణయించారు. దరఖాస్తు సమయంలో జనరల్/ఓబీసీ అభ్యర్థులు రూ.1000, ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్/మహిళా అభ్యర్థులు రూ.600 రిజిస్ట్రేషన్ ఫీజు కింద చెల్లించాలి. వికలాంగ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారు డిసెంబర్ 22 నుంచి 25, 2023 వరకు ఏవైనా తప్పులు దొర్లితే దరఖాస్తు సవరణ చేసుకోవచ్చు.

**ఖాళీల వివరాలు..**

న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో)లో 102 ఖాళీలు ఉన్నాయి.

జూనియర్ అసిస్టెంట్-కమ్ టైపిస్ట్ పోస్టులు: 50

స్టెనోగ్రాఫర్ పోస్టులు : 52

మోతిహారి (బీహార్)లోని మహాత్మాగాంధీ సెంట్రల్ యూనివర్సిటీలో 48 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**ముఖ్యమైన తేదీలు..**

ఆన్‌లైన్ దరఖాస్తుకు ప్రారంభ తేదీ: డిసెంబర్ 1, 2023.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ (ఎంజీసీయూ/ ఇగ్నో): డిసెంబర్ 21, 2023.

దరఖాస్తు సవరణ తేదీలు: డిసెంబర్ 22 నుంచి 25-12-2023 వరకు.

**ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు**

వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్మీడియెట్ మొదటి, రెండో ఏడాది జనరల్, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు ఇంటర్ బోర్డు పొడిగించింది. ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించేందుకు నవంబర్ 30తో గడువు ముగిసింది. ఈ గడువును మరో ఐదురోజులు పొడిగిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు ఇచ్చారు.రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లింపుకు డిసెంబర్ 5 వరకు అవకాశం కల్పించారు. రూ.1000 ఆలస్య రుసుంతో డిసెంబర్ 15 వరకు చెల్లించవచ్చు. మొదటి/ రెండో సంవత్సరం థియరీ పరీక్షలకు రూ.550, రెండో ఏడాది జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు రూ.250, బ్రిడ్జి కోర్సులకు రూ.150 చెల్లించాలి.

ఇంటర్ రెండేళ్ల థియరీ పరీక్షలకు రూ.1100, ఒకేషనల్ రెండేళ్ల ప్రాక్టికల్స్‌కు రూ.500, ఒకేషనల్ బ్రిడ్జి కోర్సుకు రూ.300 ఫీజు చెల్లించాలి. ఇప్పటికే ఇంటర్ పాసై ఇంప్రూవ్‌మెంట్ రాసేవారు రెండేళ్లకు కలిపి ఆర్ట్స్ కోర్సులకు అయితే రూ.1240, సైన్స్ కోర్సులకు అయితే రూ.1440 సంబంధిత కాలేజీల్లో చెల్లించాలి.

**ఎస్ఎస్‌సీ జేఈ టైర్-2 పరీక్ష అడ్మిట్ కార్డులు విడుదల**

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలు, శాఖల్లో 1,324 జూనియర్ ఇంజినీర్ గ్రూప్-బి (నాన్ గెజిటెడ్) నియామకాలకు సంబంధించి టైర్-2 (పేపర్-2) పరీక్ష రాసేందుకు అడ్మిట్ కార్డులను స్టాఫ్ సెలక్షన్ కమిషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలు డిసెంబర్ 4వ తేదీన దేశ వ్యాప్తంగా పలు ప్రధాన పరీక్ష కేంద్రాల్లో జరగనుంది. పేపర్-1లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు రోల్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో నమోదుచేసి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పేపర్-1 ఆన్‌లైన్‌లో నిర్వహించగా పేపర్-2 పరీక్ష ఆఫ్‌లైన్ విధానంలో డిస్క్రిప్టివ్ మోడ్‌లో రాత పరీక్షలు నిర్వహిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పేపర్ 1 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం, కీలను డిసెంబర్ 13వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**జేఈఈ మెయిన్స్ దరఖాస్తు గడువు పొడిగింపు..**

జేఈఈ మెయిన్స్ (జనవరి) 2024 ఆన్‌లైన్ దరఖాస్తు గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పొడిగించింది. జేఈఈ మెయిన్స్ తొలి విడత దరఖాస్తు గడువు నవంబర్ 30వ తేదీతో ముగియగా ఆ గడువును డిసెంబరు 4వ తేదీ (రాత్రి 9 గంటల) వరకు పొడిగిస్తూ ఎన్టీఏ ప్రకటన వెలువరించింది. ఈ మేరకు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) సవరించిన టైంటేబుల్‌ను వెల్లడించింది. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవల్సిందిగా సూచించింది. దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 1వ తేదీన మొదలైంది. సమర్పించిన దరఖాస్తుల్లో పొరపాట్లు ఉంటే వెబ్‌సైట్‌లో డిసెంబరు 6 నుంచి 8వ తేదీ వరకు సవరించుకోవచ్చని ఎన్‌టీఏ పేర్కొంది. జేఈఈ మెయిన్స్ తొలివిడత పరీక్ష దేశవ్యాప్తంగా 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ జరగనుంది.

ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్రప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించవల్సి ఉంటుంది. ఇక రెండోవిడత పరీక్ష వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరుగుతుంది. జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాలు ఫిబ్రవరి 12న వెల్లడి స్తారు. తెలుగు సహా దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం 13 ప్రధాన భాషల్లో జేఈఈ మెయిన్స్ పరీక్ష జరగనుంది. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన వారిలో దాదాపు 2.5లక్షల మందిని అడ్వాన్స్‌డ్ రాసేందుకు అనుమ తిస్తారు.

**భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్‌లో 398 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీలు..**

తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (BHEL) 2023-24 విద్యాసంవత్సరానికి గానూ వివిధ విభాగాల్లో ట్రేడ్ అప్రెంటిస్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, మెషినిస్ట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ప్లంబర్, కార్పెంటర్, మోటార్ మెకానిక్ ట్రేడుల్లో ఖాళీలున్నాయి. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 398 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయనున్నారు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణత పొంది ఉండాలి. 2021, 2022, 2023 సంవత్సరాల్లో ఐటీఐలో ఉత్తీర్ణత పొందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవ డానికి అర్హులు.

**వయోపరిమితి..**

అప్రెంటిస్ ఖాళీలకు దరఖాస్తు చేసుకునే వారి వయసు నవంబర్ 1, 2023వ తేదీ నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు డిసెంబర్ 1, 2023వ తేదీ రాత్రి 11 గంటల 45 నిమిషాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత పరీక్ష మార్కులు, అసెస్‌మెంట్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ స్టాండర్డ్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు. అసెస్‌మెంట్ టెస్ట్ తేదీ ఎప్పుడనేది త్వరలో ప్రకటిస్తారు.

**విభాగాల వారీగా అప్రెంటిస్ ఖాళీల వివరాలు**

ఏసీ మెకానిక్ ఖాళీలు : 5

కార్పెంటర్ ఖాళీలు : 3

ఎలక్ట్రీషియన్ ఖాళీలు : 36

ఫిట్టర్ ఖాళీలు : 178

ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ ఖాళీలు : 9

మెషినిస్ట్ ఖాళీలు : 28

మసోన్ ఖాళీలు : 6

మోటర్ మెకానిక్ ఖాళీలు :8

ప్లంబర్ ఖాళీలు : 2

టర్నర్ ఖాళీలు : 23

వెల్డర్ ఖాళీలు : 100

**ముఖ్య తేదీలు**

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 1, 2023.

పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి: డిసెంబర్ 2, 2023.

**సీటెట్ జవవరి 2024 తుది గడువు పొడిగింపు..**

సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్ జవవరి 2024) తుది గడువును పొడిగిస్తూ సీబీఎస్సీ ప్రకటన వెలువరించింది. నవంబర్ 30వ తేదీతో తుదిగడువు ముగియ నుండగా దానిని డిసెంబర్ 1వ తేదీ వరకు పొడిగించారు.

**స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జేఈ రాత పరీక్ష తుది కీ విడుదల**

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలు, శాఖల్లో 1,324 జూనియర్ ఇంజినీర్ గ్రూప్-బి (నాన్ గెజిటెడ్) నియామకాలకు సంబంధించి రాత పరీక్ష (పేపర్-1) కు సంబంధించిన తుది ఆన్సర్ కీను స్టాఫ్ సెలక్షన్ కమిషన్ విడుదల చేసింది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో రోల్ నంబర్, పాస్‌వర్డ్ నమోదు చేసి ప్రశ్నపత్రం, కీలను డిసెంబర్ 13వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**డిసెంబర్ 1 నుంచి ఇగ్నో పరీక్షలు**

ఇగ్నో నిర్వహించే డిసెంబర్ 2023 టర్మ్ ఎండ్ పరీక్షలు డిసెంబర్ 1 నుంచి జనవరి 9వ తేదీ వరకు జరుగుతాయని ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజినల్ డైరెక్టర్ వెల్లడించారు. విజయవాడ పరిధిలో ఏడు విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, ఆదోని, అనంతపురంలో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అర్హులైన అభ్యర్థులందరూ ఇగ్నో అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



# ఏపీపీఎస్సీ గ్రూప్-2 సిలబస్‌లో కీలక మార్పులు..

ఏపీపీఎస్సీ గ్రూప్ 2 ఖాళీల భర్తీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వచ్చే వారంలో నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇప్పటికే గ్రూప్ 2 ఉద్యోగాల భర్తీకి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ ఆమోదం తెలుపుతూ జీవో జారీ చేసింది. ఈ మేరకు త్వరలో ప్రకటన విడుదల చేయనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ గతంలో వెల్లడించారు.

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఏపీపీఎస్సీ గ్రూప్-2 రాత పరీక్షలకు కొత్త సిలబస్ విడుదల చేసింది. మొత్తం 450 మార్కులకు గాను రెండు దశల రాత పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు అప్పట్లో ప్రకటించింది. మొదటి దశ (ప్రిలిమ్స్)లో 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండో దశలో 300 మార్కులకు మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తారు. అయితే మొదటి దశ పరీక్ష అయిన ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తేనే మెయిన్స్‌కు ఎంపికవుతారు.

కాగా తాజాగా గ్రూప్-2 సిలబస్‌లో ఏపీపీఎస్సీ కొన్ని కీలక మార్పులు చేసింది. ప్రిలిమ్స్‌లో కొత్తగా భారతీయ సమాజం టాపిక్‌ను చేర్చారు. దీంతో ప్రిలిమినరీ పరీక్షలో భారతదేశ చరిత్ర, భూగోళశాస్త్రం, భారతీయ సమాజం, కరెంట్ అఫైర్స్, మెంటల్ ఎబిలిటీ అంశాల నుంచి 150 మార్కులకు ప్రశ్నలు రానున్నాయి. మెయిన్స్ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్ 150 మార్కులకు ఉంటుంది. అంటే మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. మెయిన్స్ పేపర్ 1 పరీక్షలో ఆంధ్రప్రదేశ్ సామాజిక, సాంస్కృతిక చరిత్ర, భారత రాజ్యాంగం అంశాలు ఉంటాయి. పేపర్-2లో భారతదేశ-ఏపీ ఆర్థిక వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ టాపిక్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

**ఏపీపీఎస్సీ గ్రూప్ 2 ప్రిలిమ్స్ పరీక్ష విధానం..**

గ్రూప్ 2 ప్రిలిమ్స్ పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. భారతదేశ చరిత్ర (ప్రాచీన, మధ్య, ఆధునిక చరిత్ర)లో 30 మార్కులకు 30 ప్రశ్నలు, భూగోళశాస్త్రం(జనరల్, ఫిజికల్ జాగ్రఫీలో 30 మార్కులకు 30 ప్రశ్నలు, ఎకనమిక్ జాగ్రఫీ ఆఫ్ ఇండియా అండ్ ఏపీలో 30 మార్కులకు 30 ప్రశ్నలు, హ్యూమన్ జాగ్రఫీ ఆఫ్ ఇండియా అండ్ ఏపీ)లో 30 మార్కులకు 30 ప్రశ్నలు, భారతీయ సమాజం (స్ట్రక్చర్ ఆఫ్ ఇండియన్ సొసైటీ, సోషియల్ ఇష్యూస్, వెల్ఫేర్ మెకానిజం)లో 30 మార్కులకు 30 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్ (రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు)లో 30 మార్కులకు 30 ప్రశ్నలు, మెంటల్ ఎబిలిటీ (లాజికల్ రీజనింగ్,మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీ)లో 30 మార్కులకు 30 ప్రశ్నలు.. మొత్తం 7 అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

**ఏపీపీఎస్సీ గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష విధానం..**

గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష 300 మార్కులకు ఉంటుంది. పేపర్-1 (ఆంధ్రప్రదేశ్ సామాజిక, సాంస్కృతిక చరిత్ర, భారత రాజ్యాంగం)లో 150 మార్కులకు 150 ప్రశ్నలు అడుగుతారు. పేపర్-2 (భారతదేశ, ఏపీ ఆర్థిక వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ)లో 150 మార్కులకు 150 ప్రశ్నలు అడుగుతారు.

## ప్రజలకు అందుబాటులో జనసేన శ్రేణులు:నేరెళ్ల సురేష్



గుంటూరు, మేజర్ న్యూస్: లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన జనసేన శ్రేణులు, రానున్న 48 గంటలు ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరిన జనసేన పార్టీ నగర అధ్యక్షుడు మిఛౌన్గ్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎలాంటి అవసరం వచ్చినా ప్రజలకు జనసేన పార్టీ శ్రేణులు అందుబాటులో ఉంటారు అని తెలియజేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించిన జనసేన శ్రేణులు ముఖ్యంగా నగరంలో ప్రధాన సమస్య డ్రైనేజీ సైడ్ కాలవలలో, మెయిన్ డ్రైనేజ్లలో పూడిక తీకపోవటం వల్ల వర్షాకాలంలో మురుగు నీరు అంతా రోడ్లపైకి ఇళ్లల్లోకి చేరటం వల్ల ఇంటి చుట్టూ నీరు నిలవడంతో కొన్ని ఇళ్లల్లో గోడల నాని కూలిపోయే విధంగా ఉన్నాయి, అలాంటి ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వీలైనంత త్వరగా ఈ కాలువలు ఏవైతే ఉన్నాయో వాటిలో పూడిక తీసి మురుగునీరు వెళ్ళిపోయే విధంగా పనులు సత్వరమే చేయాలని, తుఫాన్ హెచ్చరిక ఐదు ఆరు రోజులు ముందు నుంచి వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న కాని కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండా ప్రజల సమస్యలను గాలికి వదిలేసి, ఇంతటి పెను తుఫాను సంభవిస్తున్నప్పుడు కూడా కనీసం ఇంట్లో నుంచి బయటికి రాకుండా వైసీపీ నాయకులందరూ వారి వ్యాపారాల్లో నిమగ్నమై ఉండటం ఆశ్చర్యం కలగజేస్తుంది అని అని అసహనం వ్యక్తం చేశారు, ఇప్పటికైనా ప్రజా సమస్యలపై స్పందించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ముస్తఫాకు, నగర మేయర్ కు, నగర కమిషనర్ చెరుకూరి కీర్తికి తెలియజేస్తున్నాం. మరి ముఖ్యంగా రెండు దఫాలుగా గుంటూరు తూర్పు నియోజకవర్గం లో గెలిచిన ఎమ్మెల్యే గారికి ప్రజల సమస్యపై అవగాహన కన్నా తను చేసే వ్యాపారంలో వచ్చే రాబడి పైయిన ఆసక్తి ఎక్కువ కనబరుస్తున్నారని దుయ్యబట్టారు.

## పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



గుంటూరు క్రైం, మేజర్ న్యూస్: పోలీస్ సిబ్బంది ప్రస్తుత తుఫాన్ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ సూచించారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ కారణంగా గుంటూరు జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్ పర్యటించారు. భద్రతా ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మరియు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా తుఫాను వలన ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన జిల్లా పోలీసు యంత్రాంగం మరియు ఇతర డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా ముందస్తు చర్యలతో ఏర్పాట్లు చేయడం జరిగింది. ఏ విధమైన అవాంఛనీయ సంఘటన జరగకుండా చూస్తూ, ప్రజలను తుఫాను గురించి తెలియజేస్తూ ఎలాంటి విపత్కర పరిస్థితులైన ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సర్వసన్నద్ధంగా ఉంచటం జరిగిందని జిల్లా ఎస్పీ శ్రీ ఆరిఫ్ హాఫీజ్ తెలిపారు. తుఫాన్ బాపట్ల దగ్గర తీరం దాటే అవకాశం వున్నందున గుంటూరు జిల్లా తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని చేబ్రోలు, పొన్నూరు రూరల్, పొన్నూరు అర్బన్ తదితర ప్రాంతాల్లో ఎస్పీ పర్యటించారు. పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి పై ఒక చెట్టు పడిపోయి వుండటం వలన వెంటనే స్పందించి అక్కడ ట్రాఫిక్ అంతరాయం లేకుండా దగ్గరే వుండి పడి పోయి వున్న చెట్టును సిబ్బందితో స్వీయ పర్యవేక్షణలో తొలగించి రహదారిపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. ప్రజలకు ఏ విధమైన సహాయ, సహకారాలు కావాల్సినా పోలీస్ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 8688831568 కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలియజేశారు. ఈ పర్యటనలో గుంటూరు జిల్లా ఎస్పీ వెంట తెనాలి డి ఎస్ పి జనార్ధన్ రావు, స్పెషల్ బ్రాంచ్ సి ఐ శ్రీనివాసరావు, పొన్నూరు రూరల్ యస్.ఐ భార్గవ్ ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# నేలకు వాలిన పంట పొలాలను పరిశీలించిన కళ్ళం రాజశేఖర్ రెడ్డి



తాడేపల్లి మేజర్ న్యూస్ : పంట చేతికందే వేళ తుఫాన్ రైతుల ఆశల పై నీళ్లు చల్లిందని తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా తెలుగు రైతు ఆధ్వర్యంలో చిర్రావూరు, గుండిమెడలో నీట మునిగిన వరి పంట పొలాలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కళ్ళం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వర్షంతో వరి చేనులు నీటతడవగా గాలులకు పంట నేలనంటిందని అన్నారు. తుఫాన్ ప్రభావం తో రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం సహాయ చర్య లు చేపట్టాలని కోరారు. తుఫాను ప్రభావంతో రైతులకు పంట చేతికి వచ్చే సమయంలో గాలితో కూడిన అధిక వర్షాల వలన వరి పంటలు నేలకి వాలి నీటమైపోయాయని అన్నారు.పంట పొలాల్లో ఉన్న నీరు బయటకు పోవాలంటే సుమారు 10 రోజుల నుండి 20 రోజులు పడుతుందని కంకులు పనికిరాకుండా పోతాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రతి వడ్ల గింజని కల్లాల దగ్గర రైతు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని తడిచిన వరి ధాన్యం అరబెట్టుటకు రైతులకు సబ్సిడీ పై టార్పాలిన్ పట్టా లు తక్షణమే అందచేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులకు ఆత్మహత్య శరణ్యమని అన్నారు. రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ముం దుకు రావాలని అన్నారు. పంట నష్టపోయిన రైతు లకు పదివేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సుమారు 800 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఇందులో 50 శాతం మంది రైతులు నష్టపోయారని అన్నారు. ఈ ప్రాంతంలో అధికారులు పర్యటించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. పంట పొలాలను పరిశీలించిన వారిలో తెలుగు యువత నియోజకవర్గ అధికార ప్రతినిధి అక్కినేని సుబ్రహ్మణ్యం, మంగళగిరి నియోజకవర్గ అధికార ప్రతినిధి నల్లిబోయిన శ్రీనివాసరావు,తమ్మా శంకర్ రెడ్డి,మక్కుపాటి మధు,దావులూరి అనిల్,కళ్ళం శ్రీనివాస్ రెడ్డి,గోగినేని నాగేశ్వరరావు,ప్రదీప్, రైతులు టంకశాల బాజీ, బాబురావు,వేలుఓలు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# వరద బీభత్సానికి కొట్టుకుపోయిన చేన్లు



తెనాలిరూరల్,మేజర్ న్యూస్: ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకి పంట చేతికి వచ్చే సమయానికి ఎదురుదెబ్బ తగిలినట్టైంది.తెనాలి, కొల్లిపర రైతులకు నష్టం వాటిల్లింది.వ్యవసాయ, ఉద్యానవిస్తరణ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలి మండలంలో 15 వేల ఎకరాలకు గాను 6 నుంచి 8 ఎకరాలకు వరి నష్టం వాటిల్లోచ్చని, తెనాలి,కొల్లిపరలో 1500 ఎకరాలకు గాను 45 ఎకరాలకు అరటి నష్టం,100 ఎకరాలకు మినుము నష్టం వాటిలోచ్చన్నారు.రాబోయే రెండు రోజుల్లో మరింత నష్టం వాటిల్లోచ్చని చెబుతున్నారు. రైతులు తుపాన్ ని దృష్టిలో ఉంచుకుని పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.తుపాన్ అనంతరం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి నష్టాన్ని పూర్తిగా అంచనా వేసి నష్టపరిహారాన్ని ప్రకటిస్తారని అన్నారు. రైతులను ఖచ్చితంగా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎలాంటి అపోహాలకు పోవద్దని ప్రతి రైతుని ఆదుకునే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందని రైతుల నష్టాన్ని అంచనా వేసి ఒక ప్రణాళిక సిద్ధం చేస్తారన్నారు.

**కొలకలూరులో 1363 ఎకరాలకు వరి నష్టం**

మండలంలోని మేజర్ పంచాయతీ అయిన కొలకలూరు గ్రామంలో 987 ఎకరాల వరికి గాను సచివాలయం వన్ కింద 247,సచివాలయం టూ కింద 810 ఎకరాలకు గాను 350 నష్టం, కొలకలూరు త్రీ కింద 1298 ఎకరాలకు గాను 766 ఎకరాలు మొత్తం 1363 ఎకరాలకు నష్టం వాటిల్లింది.అదేవిధంగా 67 ఎకరాల ఉన్న మినుము నిలువు మీద ఉండడంతో పంట తుపాన్ కారణంగా నష్టపోయే పరిస్థితి ఉంది.అందులో 3 ఎకరాలు ఓదులుపైన నీట మునిగింది. అరటి, పసుపు, కంద, ఆకుకూరలు నష్టం వాటిల్లలేదు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ద్వారా నష్టాన్ని అందిస్తాం ఏదైతే వరి పంట ఉద్యాన పంటలు ఈ తుపాన్ కి దెబ్బతిన్న వాటికి ప్రభుత్వం నష్టపరిహారాన్ని అంచనా వేసి రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారాన్ని ఇన్ఫుట్ సబ్సిడి ద్వారా అందించడం జరుగుతుంది.అదేవిధంగా పంట కోత ప్రయోగాల ద్వారా పంట నష్టాన్ని అంచనా వేసి పంట భీమా రూపంలో రైతులకు అందించడం జరుగుతుంది.

# భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలి



మంగళగిరి, మేజర్ న్యూస్: నగరంలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 22,23, తేదీల్లో నిర్వహించనున్న ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (RK), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు లు అధికారులకు సూచించారు. మంగళవారం దిగువ సన్నిధి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన ఆవరణలో ముక్కోటి ఏకాదశి వాల్ పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను వారు ఆవిష్కరించి అనంతరం ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు మాట్లాడుతూ... ముక్కో టి ఏకాదశి సందర్భంగా ఈనెల 23వ తేదీన స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం, శంకు తీర్థానికి రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు ఎటు వంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకో వాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఎగువ, దిగువ సన్నిధిల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో తాత్కాలిక క్లాక్ రూమ్ లతో పాటు యూపీహెచ్ వైద్యులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు అవసరమైన మేరకు తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అవాంతరాలు కలుగకుండా చూడాలన్నారు. స్వామి వారి దర్శనం కోసం తరలి వచ్చే భక్తులకు చాలినన్ని క్యూలైన్లతో పాటు దివ్యాంగులకు, సీనియర్ సిటిజన్స్ కు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో దేవస్థాన ఆవరణను ఎప్పటికప్పుడు ఊడ్పించి శుభ్రంగా ఉంచాలన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఎగువ, దిగువ సన్నిధిల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కింగ్ లో భక్తులు తమ వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జీవీ రామ్ ప్రసాద్, దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్, డీఈ కృష్ణారెడ్డి , విద్యుత్ ఏడీఈ అక్కల సత్య నారాయణ, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి, పట్టణ ఎస్ఐ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలింపు



పెదకాకాని మేజర్ న్యూస్ : మీ చౌంగ్ తుఫాన్ కారణంగా పెదకాకాని మండల పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి ఆ ప్రాంతాల వాసులను రెవెన్యూ పోలీస్ అధికారులు సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు నంబూరు గ్రామ పరిధిలోని ఎస్టీ కాలనీలో వర్షపు నీరు ఎక్కువగా రావడంతో పలు ఇల్లు జలమయమయ్యాయి ముందస్తు జాగ్రత్తలు భాగంగా ఆ కాలనీలోని 70 మందిని ఆర్డిఓ శ్రీకర్ తహసిల్దార్ నగేష్ పెదకాకాని ఎస్ఐ వినోద్ బాబులు సమీప ప్రాంతంలోని జిల్లా పరిషత్ స్కూల్ కు తరలించారు అక్కడ వారికి వసతి తో పాటు బోధన సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు

# రైతులకు బీమా వర్తించకుండా చేసిన అజ్ఞాని ముఖ్యమంత్రి



తెనాలి, మేజర్ న్యూస్ : ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే రైతుల్ని ముంచిందని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రైతుల్ని ఆదుకోవాలని రైతులకు ఎకరాకి రూ.20 వేలు తక్షణ సాయం అందించాలని ప్రతి గింజా కొనే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకి రూ. 20 వేల చొప్పున తక్షణ సాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వదిలి రైతాంగాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని స్పష్టం చేశారు. ఫసల్ బీమా పథకం చెల్లించని నిర్లక్ష్య వైఖరికి, అసమర్ధతకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని కోరారు. ప్రతి గింజను కొనే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాకు ప్రభుత్వం విడుదల చేసిన రూ. 2 కోట్ల సాయం ఏ విధంగానూ చాలదన్నారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు భరోసా నింపే విధంగా జనసేన పార్టీ నిలబడుతుందని తెలిపారు.రెండు మూడు గంటల పాటు భూతలం మీద కూడా తీవ్ర ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారని బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలతోపాటు ఏడు జిల్లాలపై ఈ తుపాను తీవ్ర ప్రభావం చూపుతుందని తెలుస్తోందని రైతులకు నష్టం కలిగించే విధంగా, సామాన్యులకు ఇబ్బంది కలిగించే విధంగా పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని కనీసం నీరందించలేని పరిస్థితుల్లో సొంతంగా మోటర్లు పెట్టుకుని రైతులు కష్టపడి పంటలు కాపాడుకున్నారని పంట చేతికి వచ్చే సమయంలో ఇలాంటి దురదృష్టకర పరిస్థితులు రావడం బాధ కలిగిస్తోందన్నారు. పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నష్టపోయిన రైతాంగానికి మా జనసైనికులు, నాయకులు అండగా నిలిచి సహకారం అందిస్తారని రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించకుండా రైతుకి నష్టం కలిగించారని తెనాలి మండలంలో 15 వేల ఎకరాలు, కొల్లిపర మండలంలో 18 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని తుపాను ప్రకటనలతో రాత్రింబవళ కష్టపడి కొంత మంది కోతలు పూర్తి చేశారని అయితే అది పది శాతం కూడా మించలేదని కోతలు పూర్తయిన 10 శాతంలో ఎంత మంది మిల్లర్లకు అమ్ముకున్నారో కూడా చెప్పలేమని ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకానికి రాష్ట్రం వాటా చెల్లించకుండా రైతుల్ని ముంచిందని రైతులకు మేమే కడతామని చెప్పి మరీ అపార నష్టం కలిగించారని గత రెండేళ్లు బీమా కింద కేంద్రం సుమారు రూ. 1100 కోట్లకు పైగా పరిహారం చెల్లించిం దని ఈ ఏడాది రాష్ట్ర వాటా చెల్లించక పోవడంతో బీమా వర్తించదని తేల్చేసిం దని రైతులకు ఫసల్ బీమా పథకం వర్తించకుండా చేసిన అజ్ఞాని ముఖ్యమం త్రి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కేవలం 16 మంది రైతులకు మాత్రమే బీమా వర్తించిందన్నారు. ఇంత నష్టం వాటిల్లినప్పుడు బీమా కట్టకపోతే రైతాంగం ఏమైపోతారని ముఖ్య మంత్రి బాధ్యత వహించాలని కరవు మండలాల ప్రకటన వ్యవహారంలో కూడా ప్రభుత్వం ఇలాగే వ్యవహరించిందన్‌ఈ ఏడు జిల్లాల్లో 465 మండలాల్లో కరువు పరిస్థితులు ఉంటే కేవలం 103 మండలాలను మాత్రమే కరవు మండలా లుగా ప్రకటించిందని ప్రభుత్వ చర్యలు రైతాంగా నికి అపార నష్టం కలిగిస్తున్నాయని రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితికి ముఖ్యమంత్రి కచ్చితంగా బాధ్యత వహించాలన్నారు.అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి, రైతులకు న్యాయం జరిగే ఏర్పాటు చేయాలి" అన్నారు.ఈ సమావేశంలో పార్టీ నేతలు బండారు రవికాంత్,ఇస్మాయిల్ బేగ్,హరిదాసు గౌరీశంకర్,యెర్రు వెంకయ్య నాయుడు,దివ్వెల మధుబాబు,జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసులో ఒకరు అరెస్ట్




గుంటూరు క్రైమ్, మేజర్ న్యూస్: తనను కాదని వేరే వారితో అక్రమ సంబంధం పెట్టుకుందని అతను ఆగ్రహంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. నమ్మకంగా బైక్ పై తన ఇంటికి తీసుకొని వెళ్లి హతమార్చాడు. గుంటూరు లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధి 6/3 లైన్ సంపత్ నగర్ లో నివాసం ఉండే షేక్ సైదా అనే వ్యక్తిని మంగళవారం లాలపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతను శ్రీనివాసరావు పేట కు చెందిన మృతురాలు షేక్ హసీనా ఏ బాజీ తో గత కొంతకాలంగా అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈమె మరికొందరితో అక్రమ సంబంధం పెట్టుకుందని అనుమానిస్తూ ఉండేవాడు. ఈనెల ఒకటో తేదీన మాట్లాడాలని మృతురాలు హసీనాను తన ఇంటికి తీసుకు వచ్చినాడు. నాతో కాకుండా మరికొందరితో అక్రమ సంబంధం పెట్టుకున్నామని నిలదీశాడు. నా ఇష్టం నీవెవరు చెప్పడానికి అని ఆమె వాగ్వాదం చేసింది. ఈ నేపథ్యంలో సైదా ఆగ్రహంతో రోకలి బండ తీసుకుని ఆమెపై దాడి చేశాడు. సంఘటనలో ఆమె అక్కడే మృతి చెందినది. మృతురాలు భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా హత్యకు పాల్పడిన సైదాను అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం శ్రీనివాసరావు తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ తో పాటు, ఎస్సై విజయ్ కుమార్, ఎస్ఐ కరుణాకర్, కానిస్టేబుళ్లు ఎం. రవి, పి.కిరణ్, కే.సుబ్బారావు, డి. రమేష్, కే మహేష్ లను జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్, ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పి నాచికెట్ షెల్కే అభినందించారు.

# మంగళగిరి టిడ్కో గృహాలకు తాగునీటి ఇక్కట్లు



మంగళగిరి మేజర్ న్యూస్: మంగళగిరి టిడ్కో గృహాల ప్రజలు గత రెండు రోజులుగా తాగునీటి కోసం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. స్థానిక అధికారుల నిర్లక్ష్యంతోనే తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొవల్సి వస్తోందని టిడ్కో నివాసితులు వాపోతున్నారు. టిడ్కో గృహాలకు తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తేదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గత రెండు రోజులుగా జలధార పేరుతో మంచినీటి ట్యాంకర్లను పంపించి తాగునీటిని సరఫరా చేయిస్తున్నారు. వాటర్ ట్యాంకర్‌లను పంపి తాగునీటిని సరఫరా చేయిస్తున్న నారా లోకేష్‌కు టిడ్కో గృహాల నివాసితులు ధన్యవాదములు తెలిపారు. మంచినీటి పునరుద్దరణ జరిగే వరకు ట్యాంకర్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందని మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు తెలియజేశారు. ఈ సందర్భంగా టిడ్కో నివాసితులు మాట్లాడుతూ కనీస అవసరాలకు కూడా నీరు లేక వందలాది కుటుంబాలు వర్షంలో సైతం ఇబ్బందులు పడుతున్నామని మండిపడ్డారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నారని వాపోయారు. తక్షణమే టిడ్కో గృహాలకు తాగునీటి ఎద్దడిని పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

# 16 గంటల నుంచి విద్యుత్ కు అంతరాయం



బాపట్ల మేజర్ న్యూస్ : మిథున్ తుఫాను బాపట్ల తీర ప్రాంతంలో తీరం దాటిన నేపథ్యంలో గత 16 గంటల నుండి విద్యుత్ ప్రచారానికి అంతరాయం కలిగింది. మంగళవారం అర్ధరాత్రి నుండి పెనుగాలులతో కూడిన వర్షాలు కురవడం వలన పలు చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీనివలన విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కారణంగా విద్యుత్ ప్రచారంలో తీవ్ర అంతరాయం కలుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు ప్రజలు విద్యుత్ లేకపోవడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# కేంద్ర సాయుధ బలగాల్లో 26,146 కానిస్టేబుల్ పోస్టులు



స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) వివిధ కేంద్ర సాయుధ బలగాల్లో కానిస్టేబుల్/ రైఫిల్‌మ్యాన్ (గ్రౌండ్ డ్యూటీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 26,146 కానిస్టేబుల్/ రైఫిల్‌మ్యాన్ పోస్టులు భర్తీ చేస్తారు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్), సశస్త్ర సీమ బల్ (ఎస్ఎస్బీ), సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్ఎస్ఎఫ్)లో కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టులను, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), అస్సాం రైఫిల్స్ (ఏఆర్)లో రైఫిల్‌మ్యాన్ (జనరల్ డ్యూటీ) పోస్టులు భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) ప్రకటన వెలువరించింది. గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్సిటీ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. పురుష అభ్యర్థుల ఎత్తు 170 సెంటీమీటర్లు, మహిళా అభ్యర్థులకు 157 సెంటీమీటర్లలకు తగ్గకుండా ఉండాలి.

**వయోపరిమితి**

అభ్యర్థుల వయసు జనవరి 1, 2024 నాటికి 18 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలి. అంటే అభ్యర్థులు జనవరి 2, 2001 కంటే ముందు, జనవరి 1, 2006 తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిసెంబర్ 31, 2023వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుము కింద జనరల్ అభ్యర్థులు రూ.100 చెల్లించాలి. మహిళలు/ ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనిక అభ్యర్థులకు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. రాతపరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు. ఆన్‌లైన్ పరీక్ష ఫిబ్రవరి లేదా మార్చిలో జరిగే అవకాశం ఉంది. ఇంగ్లిష్, హిందీ భాషల్లోనే కాకుండా.. తెలుగు భాషతో సహా మొత్తం 13 ప్రాంతీయ భాషల్లో ఈ పరీక్ష జరుగుతుంది. ఎంపికైన వారికి నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 వరకు జీతంగా చెల్లిస్తారు.

**విభాగాల వారీగా ఖాళీల వివరాలు**

కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ)/రైఫిల్‌మ్యాన్ (జనరల్ డ్యూటీ) మొత్తం పోస్టులు: 26,146 పోస్టులు ఉన్నాయి. వీటిల్లో **బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) పోస్టులు:** 6,174 ( వీటిల్లో పురుషులు- 24,806, మహిళలు- 963) **సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) పోస్టులు:** 11,025 ( వీటిల్లోపురుషులు- 9,913, మహిళలు- 1,112) **సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) పోస్టులు:** 3,337 పోస్టులు(వీటిల్లో పురుషులు- 3,266, మహిళలు- 71)

**సశస్త్ర సీమ బల్ (ఎస్ఎస్బీ) పోస్టులు:** 635 పోస్టులు (వీటిల్లో పురుషులు- 593, మహిళలు- 42)

**ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) పోస్టులు:** 3,189 పోస్టులు (వీటిల్లో పురుషులు- 2,694, మహిళలు- 495)

**అస్సాం రైఫిల్స్ (ఏఆర్) పోస్టులు:** 1,490 ( వీటిల్లోపురుషులు- 1,448బీ మహిళలు- 42)

**సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్ఎస్ఎఫ్) పోస్టులు:** 296 ( వీటిల్లోపురుషులు- 222, మహిళలు- 74)

**ముఖ్యమైన తేదీలు..**

**ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** డిసెంబర్ 31, 2023

**ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు చివరి తేదీ:** జనవరి 1, 2024.

**దరఖాస్తు సవరణ తేదీలు:** జనవరి 4, 5, 6, 2024

**కంప్యూటర్ అధారిత రాత పరీక్ష తేదీ:** ఫిబ్రవరి- మార్చి 2024